PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 219 | విజయవాడ, ఆదివారం 12 మార్చి 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7. 00

Vol No | Vijayawada, Sunday 12 March 2023 | Rs

ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే

సచివాలయ ఉద్యోగులకు సెలవులు

- జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు

లోపలి పేజీలో..

బరితెగించిన బిజెపి మూకలు

- ఎంపీల బృందంపై రాళ్ల దాడి, వాహనాలకు నిప్పు
- పలు వాహనాల ధ్వంసం
- బిజెపి హింసాకాండ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

లోపలి పేజీలో..

ఇడి విచారణ అనంతరం బయటకు వస్తున్న కవిత

మళ్లీ 16న విచారణ

కవితను 9 గంటల పాటు ప్రశ్నించిన ఇడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ శనివారం దాదాపు 9 గంటల పాటు విచారించింది. మళ్లీ ఇదే నెల 16న విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. ఇడి విచారణకు హాజరయ్యే ముందుగా శనివారం ఉదయం తెలంగాణ ఐటి మంత్రి, కవిత సోదరుడు కెటిఆర్, బిఆర్ఎస్ లీగల్ సెల్ సభ్యులతో ఆమె కాసేపు చర్చించారు. అనంతరం ఉదయం 9 గంటలకు భారత జాగతి కార్యకర్తలు, బిఆర్ఎస్ శ్రేణులకు తుగ్లక్‌రోడ్‌లోని కెసిఆర్ నివాసంలో అల్పాహార విందు సందర్భంగా ఆమె కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు కవితకు మద్దతుగా సంఘీభావం తెలిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి 10 వాహనాల కాన్వాయ్‌లో అబ్దుల్ కలాం రోడ్‌లోని ఇడి ప్రధాన కార్యాలయానికి చేరుకున్న కవిత, తన పిడికిలి బిగించి అభివాదం చేస్తూ ఇడి కార్యాలయంలోకి అడుగుపెట్టారు.

తెలంగాణ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కవితకు మద్దతుగా ఇడి కార్యాలయం వద్దకు వెళ్లారు. కవితతో పాటుగా ఆమె భర్త అనిల్, న్యాయవాది మోహన్‌రావు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా ఇడి అధికారులు లోనికి రానివ్వకుండా బయటే ఆపేశారు. కవితను మాత్రమే అనుమతించారు. ఈ సందర్భంగా ఇడి ఇచ్చిన నోటీసులను ఆమె తన వెంట తీసుకెళ్లారు.

విచారణ సాగింది ఇలా..

ఉదయం 11 గంటలకు ఇడి కార్యాలయంలోకి వెళ్లిన కవిత రాత్రి 8 గంటల సమయంలో బయటకు తిరిగొచ్చారు. మధ్యలో గంటసేపు భోజనం విరామం ఇచ్చారు. అయితే ఆమె ఆహారం తీసుకునేందుకు నిరాకరించినట్లు తెలిసింది. కవితను ఐదుగురు అధికారుల బందం ప్రశ్నించారు. ఇందులో ఒక జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ స్థాయి మహిళ అధికారి, లిక్కర్ స్కాంలో ఇన్వెస్ట్ గేషన్ ఆఫీసర్(ఐఓ) జోగిందర్, మరో ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు ఉన్నారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఎ) సెక్షన్ 50 కింద కవిత స్టేట్మెంట్ రికార్డ్ చేశారు. తొలుత ఆమె వ్యక్తిగత వివరాలను రికార్డ్ చేసుకున్న అధికారులు, అనంతరం మద్యం కుంభకోణానికి సంబంధించిన విచారణ ప్రారంభించారు. మౌఖికంగా, లిఖితపూర్వకంగా కవిత స్టేట్ మెంట్ రికార్డు చేశారు. విచారణ ముగిసిన అనంతరం ఈడి కార్యాలయం నుంచి కవిత బయటకు రాగానే ఆమె మద్దతుదారులు జై బిఆర్ఎస్.. జై కెసిఆర్.. జై కవితక్క అంటూ నినాదాల హోరెత్తించారు. వారికి అభివాందం చేస్తూ

మిగతా 5లో

పది లక్షల ఎకరాలు బీడు

• భారీగా తగ్గిన రబీ సాగు • గతేడాది కంటే ఆరు లక్షల ఎకరాలు తక్కువ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఈ తడవ రబీ సాగు విస్తీర్ణం బాగా పడిపోయింది. సీజన్ సాధారణ సాగులో పది లక్షల ఎకరాలకుపైన బీడు పడింది. ఖరీఫ్‌లో వర్షాభావం, తుపాన్లు, వరదల వలన సేద్యం తగ్గడం కద్దు. ఆ లోటు రబీలో భర్తీ అవుతుంది. కానీ ఎన్నడూ లేని విధంగా ఈ మారు రబీలో లక్షలాది ఎకరాలు సాగు లేక ఖాళీ పడ్డాయి. రబీలో ఆహార ధాన్యాల సాగు ఎక్కువ. అందులోనూ వరి, పప్పుధాన్యాలు అధికంగా సాగు చేస్తారు. ఈ సారి ఆ పంటలు పది లక్షల ఎకరాల్లో సాగు కాలేదు. ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు బానే ఉన్నాయి. భూగర్భ జలాలకు కొరత లేదు. అయినప్పటికీ రబీ సాగు భారీగా తగ్గడానికి పంటలకు గిట్టుబాటు ధరలు లేమి, వ్యవసాయ ఉత్పాదకాల ధరలు, పెట్రోలు, డీజిల్ ఛార్జీలు, కల్తీ, నకిలీ విత్తనాలు, ప్రకృతి విపత్తులు, వరి సాగుపై ప్రభుత్వ ఆంక్షలు, రైతులకు సర్కారు నుంచి అంతగా లభించని తోడ్పాటు... ఇత్యాది కారణాల వలన రబీ సాగు తగ్గిందని, రైతులు అనాసక్తి చూపారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఆది నుంచీ నెమ్మదే

రబీ ప్రారంభం నుంచీ సాగు ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా నడిచింది. మామూలుగా ఫిబ్రవరి చివరాఖరుకి సీజన్ ముగుస్తుంది. మార్చిలో నీటి వనరులున్న ప్రాంతాల్లో వరి నాట్లు వేస్తారు మార్చి 9 నాటికి మొక్కజొన్న, కుసుమలు, పొద్దుతిరుగుడు వంటి చిన్న చితకా పంటలు తప్ప తతిమ్మావన్నీ ఈ సారి తగ్గాయి. రబీలో 58 లక్షల ఎకరాల్లో పంటల సాగును ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. సీజన్ నార్మల్ 57.30 లక్షల ఎకరాలు. ఇప్పటికి 46.52 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. దాదాపు 10.78 లక్షల ఎకరాల్లో (19 శాతం) సాగు లేదు. గతేడాది కంటే సుమారు 6.95 లక్షల ఎకరాల్లో సేద్యం తగ్గింది.

తిండి గింజలు సైతం

ఆహార ధాన్యాలు 10.05 లక్షల ఎకరాల్లో (19 శాతం) తగ్గాయి. వరి 17 శాతం, ముతక ధాన్యాలు 7 శాతం, పప్పుధాన్యాలు 25 శాతం తగ్గాయి. ముతక ధాన్యాల్లో మొక్కజొన్న మాత్రం నార్మల్‌కు మించి 18 శాతం ఎక్కువ సాగైంది. సజ్జ, రాగి, చిరుధాన్యాలు తక్కువ సాగయ్యాయి. రబీలో వరికి సమానంగా పప్పుధాన్యాలు సాగు చేస్తారు. కాగా ఈ మారు వాటి సాగు పడిపోయింది. పప్పుల్లో ఎక్కువ సాగు చేసే శనగ సైతం ఈ సారి తగ్గింది. 30 శాతం విస్తీర్ణంలో శనగ సాగు కాలేదు. కర్నూలు, నంద్యాల, కడప, అనంతపురం, ప్రకాశం, గుంటూరులో శనగ సాగు బాగా తగ్గింది. మినుములు 17 శాతం, పెసలు 33 శాతం తగ్గాయి. రబీలో నూనెగింజల సాగు తక్కువ. అందులోనూ 14 శాతం సాగు కాలేదు.

రబీ సాగు (లక్షల ఎకరాలు)

పంట	నార్మల్ సాగు	సాగైంది	తగ్గుదల
వరి	19.72	16.30	3.42
ముతకధాన్యాలు	8.17	7.57	0.60
పప్పుధాన్యాలు	24.00	17.95	6.05
ఆహారధాన్యాలు	51.90	41.85	10.05
నూనెగింజలు	3.47	3.00	0.47
మొత్తం	**57.30**	**46.52**	**10.78**

గ్యారంటీలపై ఉక్కుపాదం

- 2022 పాలసీ తెస్తున్న కేంద్రం
- ఒకే తరహాపై కొన్ని రాష్ట్రాల విముఖత

లోపలి పేజీలో..

ఇరాన్ - సౌదీ మధ్య చారిత్రాత్మక ఒప్పందం

- దౌత్య సంబంధాల పునరుద్ధరణకు ఇరు దేశాలు అంగీకారం
- ఫలించిన చైనా మధ్యవర్తిత్వం
- స్వాగతించిన పలు దేశాలు

లోపలి పేజీలో..

తప్పుచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ఎన్నికల కమిషన్‌కు అజశర్మ ఫిర్యాదు

ముగిసిన ప్రచారం

• ప్రలోభాలు, బెదిరింపులే అధికార పార్టీ అజెండా! • రేపు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. చివరి రోజు హోరాహోరీగా ప్రచారం జరిగింది. పిడిఎఫ్ అభ్యర్థులు ప్రచారంలో ముందున్నారు. మూడు పట్టభద్రుల స్థానాలకు, రెండు ఉపాధ్యాయ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ప్రలోభాలకు, బెదిరింపులకు అధికార వైసిపి పెద్ద ఎత్తున తెరలేపడంతో ప్రధాన పోటీదారులు అప్రమత్తమయ్యారు. డబ్బు, కానుకల పంపిణీని అడ్డుకోవడానికి ఎక్కడికక్కడే నిఘా పెట్టారు. వైసిపి చేర్పించిన దొంగ ఓట్లు పోలవకుండా ఇప్పటికే పక్కా వ్యూహంతో ఉన్నారు. ఎక్కడెక్కడ దొంగ ఓట్లు నమోదయ్యాయో ఇప్పటికే నిర్ధారణకు వచ్చారు. ఎవరైనా దొంగ ఓటు వేయడానికి వస్తే కేసు పెట్టాలనే నిర్ణయానికి వచ్చారు. విశాఖలో వైసిపి అభ్యర్థి ఓటర్లకు పంపిణీకి చేయడానికి వెండి నాణేలు సిద్ధం చేయడంపై పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం, తిరుపతి, తిరుమలలో పెద్ద ఎత్తున దొంగ నోట్లు నమోదైనా అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిచ్చింది. చివరి రోజు ప్రచారంలో పిడిఎఫ్ అభ్యర్థులు, వారికి మద్దతు ఇస్తున్న సంఘాల నాయకులు మాట్లాడుతూ శాసన మండలి ఎన్నికల్లో దొడ్డి దారిన గెలిచేందుకు అధికార పార్టీ అనేక కుట్రలు చేస్తోందని విమర్శించారు. దొంగ ఓట్లు చేర్పించిందన్నారు. డబ్బులు, కానుకలు పంచడం లాంటివి చేస్తూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల ఎప్పుడూలేని విధంగా కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఉద్యమాలను అణచివేసి అక్కసు చాటుకుందని దుయ్యబట్టారు. ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన డిఎలు, పిఆర్‌సి ఇవ్వలేదని తెలిపారు. ఒపిఎస్ అమలు విషయంలో మాట తప్పిందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ఉద్యోగావకాశాలు లేవని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎక్కడా ఒక్క పరిశ్రమ కూడా రాలేదని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వ దుర్మార్గాలను ఎదుర్కోవాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

నాలుగు నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ!

ఎన్నికలు జరుగుతున్న ఐదు స్థానాలకుగానూ నాలుగు స్థానాల్లో త్రిముఖ పోటీ నెలకొంది. ఉత్తరాంధ్ర (ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం) పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 37 మంది పోటీలో ఉన్నారు. వారిలో పిడిఎఫ్ తరఫున కోరెడ్ల రమాప్రభ, వైసిపి నుంచి సీతంరాజు సుధాకర్, టిడిపి నుంచి వి.చిరంజీవిరావు, బిజెపి నుంచి పివిఎన్.మాధవ్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. 2,89,214 మంది ఓటర్లు ఉన్నారు. పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 49 మంది బరిలో నిలిచారు. వారిలో పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు, వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి, టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి మధ్య ప్రధాన పోటీ ఉంది. మొత్తం 3,30,124 మంది ఓటర్లు ఉన్నారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి 12 మంది బరిలో నిలిచారు. పిడిఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, వైసిపి మద్దతుతో పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డి మధ్య ప్రధాన పోటీ నెలకొంది. మొత్తం 28,148 మంది ఓటర్లు ఉన్నారు. తూర్పు రాయలసీమ (ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలు) పట్టభద్రుల నియోజకవర్గం నుంచి మొత్తం 22 మంది పోటీ చేస్తున్నారు. వారిలో పిడిఎఫ్ నుంచి మీగడ వెంకటేశ్వర రెడ్డి, వైసిపి నుంచి పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి, టిడిపి నుంచి కంచెర్ల శ్రీకాంత్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. మొత్తం ఓటర్లు 3,81,181 మంది ఓటర్లు ఉన్నారు. తూర్పు రాయలసీమ (ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలు) ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి మొత్తం ఎనిమిది మంది పోటీ చేస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి, వైసిపి అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎపిటిఎఫ్‌కు చెందిన ఎల్‌సి.రమణారెడ్డి మధ్య ప్రధాన పోటీ ఉంది. మొత్తం ఓటర్లు 27,694 మంది ఓటర్లు ఉన్నారు.

ఓట్ ఫ్రం హోమ్

వృద్ధులు, వికలాంగుల కోసం ఇసి నిర్ణయం

బెంగళూరు : వయోవృద్ధులకు, వికలాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. 80 ఏళ్లు పైబడిన వారు, అంగవైకల్యంతో బాధపడేవారు ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయం తీసుకొస్తున్నట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనరు రాజీవ్ కుమార్ శనివారం తెలిపారు. త్వరలో జరగబోయే కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో తొలిసారిగా ఈ ఓట్ ఫ్రం హోమ్ సదుపాయాన్ని కల్పించబోతున్నట్లు ఆయన వెల్లడించారు. '80 ఏళ్లు పైబడిన వారు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలనే మేం కోరుకుంటాం. అలా రాలేని పరిస్థితుల్లో ఉన్న వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని తీసుకొస్తున్నాం. అలా ఇంటి నుంచే ఓటు వేసేవారి కోసం మా బృందాలు ఫామ్-12డి పత్రాలను తీసుకెళ్తాయి. ఈ ప్రక్రియంతా వీడియో రికార్డు చేస్తారు. ఓటును మాత్రం రహస్యంగానే ఉంచుతాం. ఇంటి నుంచే ఓటు తీసుకునేప్పుడు ఆ సమాచారాన్ని అన్ని రాజకీయ పార్టీలకూ చేరవేస్తాం' అని రాజీవ్ కుమార్ వివరించారు. వికలాంగుల కోసం ప్రత్యేకంగా 'సాక్షం' పేరుతో ఓ మొబైల్ యాప్‌ను తీసుకొచ్చినట్లు సిఇసి తెలిపారు. ఆ యాప్‌లో వారు లాగిన్ అయి, ఇంటి నుంచే ఓటు సదుపాయాన్ని ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను సమర్పించేందుకు 'సువిధ' అనే యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ యాప్ నుంచే అభ్యర్థులు తమ ప్రచార ర్యాలీలు, సభలకు అనుమతులు కూడా తీసుకోవచ్చని వెల్లడించారు. కర్ణాటక ప్రస్తుత శాసనసభ పదవీకాలం మే 24తో ముగియనుంది. ఆలోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. సిఇసి రాజీవ్ కుమార్ నేతృత్వంలోని కేంద్ర ఎన్నికల బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. త్వరలో ఎన్నికల తేదీలను ప్రకటించే అవకాశాలున్నాయి.

రాష్ట్రంలో మొత్తం 224 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 5.21 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో దాదాపు 17 వేల మంది వందేళ్ల పైబడిన వారు కాగా.. 12.15 లక్షల మంది 80 ఏళ్లు దాటినవారు, 5.55 లక్షల మంది వికలాంగులు ఉన్నారు. ఇసి తాజా నిర్ణయంతో వీరందరికీ ప్రయోజనం చేకూరనుంది.

ప్రజా సమస్యలపై శ్రమజీవుల ఆగ్రహం

- ఉధృత పోరాటాలే మార్గం
- ఏప్రిల్ 5న మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ
- సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు వెల్లడి

లోపలి పేజీలో..

రామోజీ రావుపై కేసు

'మార్గదర్శి' వ్యవహారంలో నమోదు చేసిన సిఐడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మార్గదర్శి చిట్‌ఫండ్ వ్యవహారంలో ఆ సంస్థ ఛైర్మన్ చెరుకూరి రామోజీరావుపై సిఐడి కేసు నమోదు చేసింది. ఆయనతో పాటు ఎండి శైలజ, పలువరు బ్రాంచ్ మేనేజర్లపై కూడా కూడా వివిధ సెక్షన్ల కింద సిఐడి అధికారులు కేసులు పెట్టారు. శనివారం ఉదయం నుండి రాష్ట్రవ్యాప్తంగా మార్గదర్శి కంపెనీలపై దాడులు చేసిన సిఐడి పోలీసులు సాయంత్రానికి కేసులు నమోదు చేశారు. సెక్షన్ 120బి, 409,420,477(ఎ) రెడ్ విత్ 34 ఆఫ్ ఐపిసి సెక్షన్ల కింద , సెక్షన్ 5, ఎపి ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్ ఇన్ ఫైనాన్సియర్ ఎస్టాబ్లిష్‌మెంట చట్టం కింద కేసులు పెట్టినట్టు సిఐడి వర్గాలు తెలిపాయి.

వీటిలో ఎ1గా రామోజీరావును, ఏ2గా శైలజను, ఏ3గా సంబంధిత బ్రాంచ్ మేనేజర్లను పేర్కొన్నారు. చిట్ ఫండ్ నిధులు, మ్యూచువల్ ఫండ్‌ను స్పెక్యులేటివ్ మార్కెట్‌కు మార్గదర్శి మళ్లించిందని, ఇందులో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆడిటింగ్‌లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ గుర్తించిన విషయం తెలిసిందే.

కేసులతో తలవంచేది లేదు : లాలూ

లోపలి పేజీలో..

న్యూఢిల్లీ : కేంద్రం నిరాధారమైన, ప్రతీకార కేసులతో తమ కుటుంబాన్ని వేధిస్తోందని.. కానీ తాము ఎప్పటికీ బిజెపికి తలవంచమని శనివారం రాష్ట్రీయ జనతాదళ్ అధ్యక్షుడు (ఆర్‌జెడి) లాలూ యాదవ్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపికి వ్యతిరేకంగా సైద్ధాంతికంగా తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. రైల్వే ఉద్యోగాల కోసం భూములు తీసుకున్నారన్న ఆరోపణలపై లాలూ యాదవ్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులను గత రెండు రోజులుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విచారణ చేపడుతున్న సంగతి తెలిసిందే. బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వియాదవ్ నివాసంలో శుక్రవారం ఇడి సోదాలు కూడా చేపట్టింది. గతంలో ఎమర్జెన్సీ పరిస్థితులను ఎదుర్కొన్నామని, దానికి వ్యతిరేకంగా పోరాడామన్నారు. ఈ రోజు తన కుమార్తెలను, మనవరాలిని నిరాధారమైన ప్రతీకార కేసుల్లో విచారణ పేరిట బిజెపి, ఇడి వేధిస్తోందని మండిపడ్డారు. గర్భిణీ అని కూడా చూడకుండా తమ కోడలిని విచారణ పేరుతో 15 గంటల పాటు కూర్చోబెట్టారని.. దీంతో ఆమె అనారోగ్యానికి గురైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమతో రాజకీయంగా పోరాడేందుకు బిజెపి ఇంతగా దిగజారాలా అని ధ్వజమెత్తారు. ఆర్ఎస్ఎస్, బిజెపికి వ్యతిరేకంగా గతంలో తాను సైద్ధాంతిక పోరాటం చేశానని, పోరాటం కొనసాగుతోందని తెలిపారు.

సిలికాన్ వ్యాలీ బ్యాంక్ మూత

• అమెరికా చరిత్రలో రెండో అతిపెద్ద బ్యాంక్ వైఫల్యం

వాషింగ్టన్ : అమెరికాకు చెందిన సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి) షేర్లు కుప్పకూలడంతో ఆ బ్యాంక్ మూతపడింది. ఇది అమెరికా చరిత్రలోనే రెండో అతిపెద్ద బ్యాంక్ వైఫల్యం. గురు, శుక్రవారాల్లో ఈ బ్యాంక్ షేర్లు భారీగా పతనం కావడంతో వేల కోట్ల డాలర్లు ఆవిరైపోయాయి. దీని ప్రభావం మిగతా బ్యాంకింగ్ గ్రూపులపై కూడా పడడంతో వాటి షేర్లు నేల చూపులు చూశాయి. ఈ పరిస్థితుల్లో ఎస్‌విబిని మూసివేసి, దానిని అమెరికా రెగ్యులేటరీ ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్‌డిఐసి) పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుంది. ఆ బ్యాంక్ ఆస్తుల్ని సీజ్ చేసింది. 2008 సంక్షోభం తర్వాత వచ్చిన కొత్త నిబంధనలు అమెరికాలో అతిపెద్ద రిటైల్ బ్యాంకింగ్ ఎస్‌విబి వైఫల్యాన్ని ఏమాత్రం నివారించలేక పోయాయి. ఇటీవల ఆ బ్యాంక్ రెండు బిలియన్ డాలర్లు (దాదాపు రూ.16వేల కోట్లు) నష్టాలు చవి చూసింది. ఎస్‌విబి ప్రధానంగా టెక్, స్టార్టప్ సంస్థలకు నిధులను సమకూర్చుతుంది. యుఎస్ ఫెడరల్ రిజర్వుబ్యాంక్ వడ్డీ రేట్లను పెంచడం వల్లే ఎస్‌విబి సంక్షోభంలో పడిందని ఆ సంస్థ సిఇవో సెల విచ్చారు. ప్రపంచంలో కొన్ని సురక్షితమైన ఆస్తులను కొనుగోలు చేసిన ఈ బ్యాంక్ కేవలం రెండు రోజుల్లోనే ఎలా కుప్పకూలింది అని వాషింగ్టన్ పోస్ట్ తన కథనంలో ప్రశ్నించింది. ఎస్‌విబిలో సంక్షోభం నెలకొనడం.. రెండు రోజుల్లోనే ఆ బ్యాంక్ సూచీ భారీగా పడిపోవడంతో అక్కడి రెగ్యులేటరీ సంస్థ వెంటనే కళ్లు తెరచింది. ఆ బ్యాంక్ మూతపడిన తర్వాత ఇందులోని 175 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.14 లక్షల కోట్లు) వినియోగదారుల డిపాజిట్లను ఎఫ్‌డిఐసి తన చేతుల్లోకి తీసుకుంది. ఖాతాదారులకు నష్టం జరగకుండా ఎఫ్‌డిఐసి కొత్తగా నేషనల్ బ్యాంక్ ఆఫ్ శాంటా క్లారాను ఏర్పాటు చేసింది. సోమవారం నుంచి ఖాతాదారులు తమ డిపాజిట్లపై ఉన్న బీమా సొమ్మును వెనక్కి తీసుకోవచ్చని తెలిపింది. మిగతా మొత్తం బ్యాంక్ విక్రయం తర్వాత అందిస్తామని వెల్లడించింది.

ఇంటర్ పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు : సిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. వేసవి దృష్ట్యా అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స పరికరాలు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. 20-25 కేంద్రాలకు ఒక 108 అంబులెన్సును అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేందుకు వీలుగా ఆర్‌టిసి తగినన్ని బస్సులు నడిపేలా చూడాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజ్, మాల్ ప్రాక్టీస్ వంటి వదంతులు సృష్టిస్తారని, అలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద జెరాక్స్, ఫొటో కాపీయింగ్ కేంద్రాలను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా నోడల్ అధికారిని నియమించాలన్నారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనరు సురేష్ కుమార్, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎంవి శేషగిరి బాబు, ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

'నారాయణ'లో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా నారాయణ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స జరిగింది. ఆయాసం, స్వరపేటిక సమస్యతో బాధపడుతున్న ఓ మహిళకు శనివారం విజయవంతంగా చికిత్స చేశారు. ఈ సందర్భంగా నారాయణ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్, ఇఎన్‌టి వైద్యనిపుణులు రమేష్‌బాబు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 43 ఏళ్ల ఓ మహిళ ఆయాసం, స్వరపేటిక సమస్యతో బాధపడుతూ.. నారాయణ వైద్యశాలకు వచ్చారు. వైద్యసిబ్బంది ఆమెకు పరీక్షలు నిర్వహించారు. థైరాయిడ్ గ్రంధి వాచి ఉండటం..ఊపిరితిత్తుల మధ్య ఉండే ఉదరపు ఎముక వెనుక భాగం వరకు థైరాయిడ్ గడ్డ పెరిగి ఉండటాన్ని గుర్తించారు. థైరాయిడ్ గడ్డను తొలగించే సమయంలో ఊపిరితిత్తుల మధ్య ఉన్న ఎముకకు ఎటువంటి ప్రమాదం కలగకుండా అధునాతనమైన పద్ధతిని, పరికరాలను ఉపయోగించి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సమావేశంలో ఇఎన్‌టి వైద్యనిపుణులు పాల్గొన్నారు.

ఎద్దును ఢీ కొట్టిన వందేభారత్ రైలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికాంద్రాబాద్ - ఖమ్మం (20834) మధ్య వందేభారత్ రైలుకు పెను ప్రమాదం తప్పింది. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరిన రైలు సాయంత్రం 5.45 గంటలకు ఖమ్మం చేరుకుంది. ఖమ్మం దాటిన కొద్ది నిమిషాలకే చింతకాని మండలం నాగులవంచ రైల్వేస్టేషన్ సమీపంలో ఎద్దును ఢీకొంది. ఈ ప్రమాదంలో రైలు ముందు కుడి భాగం దెబ్బతింది. దీంతో ఘటనాస్థలిలోనే రైలును నిలిపివేశారు. ఖమ్మం నుంచి వచ్చిన సిబ్బంది మరమ్మతులు నిర్వహించిన అనంతరం రైలు విశాఖకు బయల్దేరింది.

3 నెలల్లో పోలవరం డయాఫ్రం వాల్‌కు రిపేర్లు పూర్తి

- సిఎస్ సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని మూడు నెలల్లో పునర్నిర్మాణం చేయాలని కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు సిఎస్ జవహర్‌రెడ్డికి జలవనరులశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ వివరించారు. శనివారం ఉదయం పోలవరం ప్రాజెక్టుపై సిఎస్ సమీక్ష నిర్వహించారు. పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. డయాఫ్రం వాల్ ఎంత దెబ్బతింది, ఎప్పటిలోపు పూర్తి చేయగలరో సమగ్ర వివరాలు సమర్పించాలని అధికారులను సిఎస్ కోరారు. ఆర్ అండ్ ఆర్ వివరాలూ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా శశిభూషణ్ కుమార్ సిఎస్‌కు పలు అంశాలను వివరించారు. డయాఫ్రం వాల్ దెబ్బతిన్నచోట్ల మూడు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శ్రీధర్, పోలవరం సిఇ సుధాకర్‌బాబు, ఎస్ఇ నరసింహమూర్తి పాల్గొన్నారు.

21, 22 న తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల : శ్రీవారి ఆలయంలో మార్చి 22న శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఆస్థానం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో 21, 22 తేదీల్లో కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, విఐపి బ్రేక్ దర్శనాలను టిటిడి రద్దు చేసింది. విఐపి బ్రేక్ దర్శనాలకు ఎలాంటి సిఫార్సు లేఖలూ స్వీకరించబోమని, సందర్శకులు గమనించాలని టిటిడి ఓ ప్రకటనలో పేర్కొంది.

ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పై వాస్తవాలు తెలుసుకోండి

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విశాఖలో ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పై ప్రతిపక్షాలు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గుంటూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో జరిగిన సమ్మిట్‌లకు ఇప్పుడు జరిగిన సమ్మిట్‌లను బేరిజు వేసుకోవాలన్నారు. దేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నారని తెలిపారు.

సమ్మిట్ వేదికగా పెట్టుబడులకు ఆంధ్ర రాష్ట్రం అనుకూలమని ప్రకటించారన్నారు. రానున్న రోజుల్లో మరింత పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని పేర్కొన్నారు. చంద్రబాబు అధికారంలో ఉండగా సమ్మిట్‌ల ద్వారా కుంభకోణాలు ఎలా చేయవచ్చో దృష్టి పెట్టారని ఎద్దేవా చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో టిడిపి నాయకులు రూ.200 కోట్లకుపైగా కాజేశారని ఆరోపించారు. ఈ విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పది మందిని అరెస్ట్ చేసిందని తెలిపారు. ఈ వ్యవహారంపై కేంద్రం దర్యాప్తు చేస్తుంటే చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లడం విడ్డూరంగా ఉందన్నారు. సమ్మిట్ వేదికపై సిఎం జగన్ ప్రకటించినట్టు అసెంబ్లీ సమావేశాల తరువాత విశాఖకు పరిపాలన వెళ్తుందని చెప్పారు.

గవర్నర్‌తో ఎపి హెచ్ఆర్‌సి ఛైర్మన్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్‌తో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ మాందాత సీతారామ్మూర్తి రాజ్‌భవన్‌లో శనివారం భేటీ అయ్యారు. ఎపి హెచ్ఆర్‌సి సభ్యులు (జ్యుడీషియల్) దండే సుబ్రమణ్యం, నాన్ జ్యుడీషియల్ సభ్యులు జి శ్రీనివాసరావు భేటీ అయిన వారిలో ఉన్నారు. శ్రీనివాసరావు రచించిన 'భారత్‌లో అవినీతిని ఎదుర్కోవడంలో అవినీతి నిరోధక సంస్థల పాత్ర' అనే పుస్తక ప్రతిని గవర్నరుకు కమిషన్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న రమాదేవి, మహిళలు

సమిష్టి పోరాటాలతోనే మహిళా హక్కుల సాధన

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సమిష్టి పోరాటాలతోనే మహిళా హక్కుల సాధన సాధ్యమని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. మహిళా దినోత్సవం కొనసాగింపులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ, ఐద్వా, యుటిఎఫ్ ఆధ్వర్యాన శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలకు రక్షణ కల్పించాలని, పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని నినదించారు. అనంతరం హైటెక్ బస్టాండ్ సమీపంలో నిర్వహించిన బహిరంగ సభలో రమాదేవి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు నోటితో అభినందనలు తెలిపి, నొసటితో వెక్కిరించేలా ఉన్నాయని తెలిపారు. లింగ వివక్ష, కుల, మత సమానత్వం కోసం మహిళలు ముందడుగు వేయాలన్నారు. మహిళల ఎదుగుదలను అడ్డుకుంటున్న నియంతృత్వ శక్తులను సమిష్టిగా ప్రతిఘటించి హక్కులు సాధించుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా మహిళలు పోరాడాలన్నారు. ధరలు తగ్గించాలని, మహిళలకు భద్రత 2కల్పించాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి టి.తులసి, జిల్లా అధ్యక్షురాలు జరీనా, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు ఎం.విజయగౌరి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వెంకటలక్ష్మి, ఎల్ఐసి యూనియన్ మహిళా విభాగం కన్వీనర్ శిరీష, అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.బేబిరాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే సచివాలయ ఉద్యోగులకు సెలవులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సెలవులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాలశాఖ డైరెక్టరు సగిలి షణ్మోహన్ శనివారం కలెక్టర్లు, ఆర్‌డిఎమ్ఎలకు ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగులు విధుల్లో చేరిన మొదటిరోజు నుంచి ఉద్యోగులకు అన్ని రకాల సెలవులు వర్తింపజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజాగా గ్రామ, వార్డు సచివాలయాలశాఖ విడుదల చేసిన ఉత్తర్వులతో ఉద్యోగులందరికీ ఎర్న్‌డ్ లీవ్స్, సుమారు 2019 అక్టోబరు 2 నుంచి 2022 డిసెంబరు 31 వరకు (98 రోజులు), 2023 జనవరి 1 నుంచి ఈ ఏడాది డిసెంబరు 31 వరకు మరో 30 రోజులు సెలవులు జమ కానున్నాయి. ఇందుకు సంబంధించి ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు, గ్రామ, వార్డు ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు బండి శ్రీనివాసరావు, అధ్యక్షులు జానీపాషా నేతృత్వంలోని ప్రతినిధుల బృందం డైరెక్టర్ షణ్మోహన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఫిబ్రవరి 7న సచివాలయాల ఉద్యోగులకు అన్ని సెలవులు వర్తింపజేయాలని సర్వీస్ రిజిస్టర్లలో నమోదు చేయాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఉత్తర్వులిచ్చినప్పటికీ క్షేత్రస్థాయి అధికారులు ఉద్యోగుల సేవా పుస్తకంలో సెలవులు మంజూరు చేయలేదు. ఇదే విషయంపై స్పష్టత ఇవ్వాలని కోరడంతో తాజా ఉత్తర్వులు వెలువడ్డాయి.

ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండేందుకే

పిడిఎఫ్‌తో అవగాహన

- చంద్రబాబు బహిరంగ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసన మండలి ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ లక్ష్యంలో భాగంగానే తెలుగుదేశం పార్టీ పిడిఎఫ్‌తో అవగాహనకు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. ఓట్లు చీలిపోతే దుర్మార్గమైన వైసిపి గెలుస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ అది జరగడానికి వీలు లేదని తెలిపారు. అధికారపార్టీ అభ్యర్థులను ఓడించేవారికి ఓట్లు వేయాలని కోరారు. ప్రాధాన్యత క్రమంలో పిడిఎఫ్,టిడిపిల మధ్య ఓట్లను పరస్పర మార్పిడి చేయడం ద్వారానే వైసిపిని ఓడించాలన్న లక్ష్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎంఎల్‌సి ఎన్నికల ఓటర్లు అందరూ గుర్తుపెట్టుకోవాలని కోరారు. పతనం అంచులో ఉన్న రాష్ట్రాన్ని పునర్‌నిర్మించుకోవాలంటే బాధ్యతతో, చైతన్యంతో ఓటు వేయాల్సిఉందన్నారు. అలా వ్యవహరించడం ద్వారా అధికార పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికలను కూడా ప్రహసనంగా మార్చాలని వైసిపి చూస్తోందని, ముఖ్యమంత్రి జగన్ కనుసన్నల్లో అడ్డదారులు తొక్కుతోందని తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో పెద్దఎత్తున బయటపడిన దొంగ ఓట్లు, వైసిపి అక్రమాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. దొంగ సర్టిఫికెట్ల ఆధారంగా పట్టభద్ర ఓటు హక్కు పొందడం తీవ్ర నేరమని, దీనికి పాల్పడిన వారు శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. అలాంటి వారిని పోలింగ్ సమయంలోనూ, ఆ తరువాత కూడా గుర్తించి శిక్షించే వీలు ఉందని తెలిపారు. అందువల్ల వైసిపి ప్రోత్సాహంతో దొంగ ఓటు పొందిన వారు పోలింగ్ రోజు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లొద్దని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- పెద్దవడుగూరు (అనంతపురం)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలంలో శనివారం చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కండ్లగూడూరు గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి(28) పది ఎకరాల్లో మిరప, పత్తిపంటలు సాగు చేశారు. పంటల సాగు నిమిత్తం రూ.పది లక్షలు అప్పులు చేశారు. పంటలు చేతికందకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీ భారం అధికమైంది. అప్పులు తీరే దారిలేక తన ఇంటి సమీపంలోని పశువుల పాకలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడికి ఏడాది క్రితమే వివాహమైంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బిసిలకు ఆర్థిక పరిపుష్టి కావాలి

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



బిసిలకు రాజకీయ సాధికారతతోపాటు ఆర్థిక పరిపుష్టి కావాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. బిసిలకు జనసేన అండగా నిలుస్తుందన్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో బిసి తరగతుల రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. తాను ఒక తరగతికి ప్రతినిధిని కాదని, ప్రజలందరికీ ప్రతినిధిగా ఉండాలనుకుంటున్నానని అన్నారు. బిసిలకు మైనింగ్‌లో ఆర్థిక పరంగా వాటా ఉండాలని, ఎస్‌సి, ఎస్‌టిలతోపాటు బిసిలకూ ఉప ప్రణాళిక బలంగా ఉండాలన్నారు. తెలంగాణలో 26 తరగతులను బిసి జాబితా నుంచి ప్రభుత్వం తొలగించిందని, ఈ విషయంపై బిఆర్ఎస్ ప్రభుత్వం వివరణ ఇవ్వాలని పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. బిసి తరగతుల తొలగింపుపై వైసిపి, టిడిపి కూడా ప్రశ్నించాలన్నారు. బిసి తరగతులు కలిస్తే రాజ్యాధికారం ఇంకెవరికీ దక్కదని, బిసిల్లో సమైక్యత లేకపోవడం వల్లే అధికారం దక్కడం లేదని అన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ పెరిగితే తూర్పు కాపులంతా పెరిగినట్లు కాదన్నారు. బిసిలను జగన్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బిసి అభ్యర్థిని ఎన్నికల్లో నిలబెట్టినప్పుడు మిగిలిన బిసిలందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. జగన్ మోహన్‌రెడ్డి బిసిలకు చేసిన మోసం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. వైసిపి ప్రభుత్వం బిసిలను విడగొట్టి పబ్బం గడుపుకుంటోందన్నారు. కులగణన తదితర అంశాలపై సూచనలు చేయాలన్నారు. తాము మత్స్యకార అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, పవర్ లూమ్స్‌కు సోలార్ విద్యుత్తు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పిఎసి సభ్యులు కోన తాతారావు, పితాని బాలకృష్ణ, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు బోనబోయిన శ్రీనివాస యాదవ్, పాలవలస యశస్విని పాల్గొన్నారు.

శ్రీశైలం మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రతిపాదనలు తప్పనిసరి : సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శ్రీశైలంలోని భ్రమరాంభ మల్లికార్జునస్వామి దేవస్థానం ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ అమలుకు సంబంధించి రానున్న సమావేశంలో లోతుగా చర్చించేందుకు వీలుగా అధికారులు నిర్దిష్టమైన ప్రతిపాదనలతో రావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయంలో శనివారం శ్రీశైలం మాస్టర్ ప్లాన్‌లో అభివృద్ధి గురించి దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, శ్రీశైలం దేవస్థాన అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రస్తుతమున్న నిర్మాణాలు, మాస్టర్ ప్లాన్‌లో అభివృద్ధి చేయనున్న నిర్మాణాలు, రోడ్ల విస్తరణ, సుందరీకరణ, తిరుమల తరహాలో మాడవీధుల ఏర్పాట్లు, క్యూలైన్ల ఏర్పాట్లపై చర్చించారు. స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మాస్టర్ ప్లాన్ ఏ విధంగా అభివృద్ధి చేయనుందనే విషయాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సిఎస్‌కు వివరించారు. శ్రీశైలాన్ని సందర్శించే యాత్రికుల సంఖ్యకు అనుగుణంగా పూర్తి స్థాయిలో సౌకర్యాలు, వసతి ఏర్పాట్లకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను సిఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్య కార్యదర్శి కె సునీత, దేవాదాయశాఖ కమిషనరు హరి జవహర్‌లాల్, చీఫ్ ఇంజినీరు శ్రీనివాస్, దేవస్థానం ఇఒ ఎస్ లవన్న, ఇఇలు రామకృష్ణ, దుర్గేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో జగన్ అడ్డదారులు

- కల్తీమద్యం కేసులో జైలుపాలైన వైసిపి అభ్యర్థి
- కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు
- టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం జగన్ అడ్డదారులు, అక్రమ మార్గాలను ఎంచుకున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నిమ్మల రామానాయుడు, బోండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. కల్తీమద్యం, విక్రయాలతో జైలుపాలై బెయిల్‌పై బయట ఉన్న శ్యామ్‌ప్రసాద్ రెడ్డి తప్ప పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా జగన్‌కు ఎవరూ దొరకలేదా? అని ప్రశ్నించారు.

టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. తూర్పు రాయలసీమ పట్టభద్ర ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి మద్యం, అక్రమ రవాణా, కల్తీమద్యం తయారీ విక్రయాల కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలు, గెలుపుకోసం జగన్ అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయబోతున్నామని వెల్లడించారు. తప్పుడు చిరునామాలతో, తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, భారీస్థాయిలో దొంగ ఓట్లు నమోదు చేశారని విమర్శించారు. 5, 7, 10వ తరగతి చదివిన వారిని పట్టభద్రులుగా నిర్ధారించి ఓటర్లుగా చేర్చారని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో ఇంటర్ విద్యార్హతతో కార్పొరేటర్లుగా పోటీ చేసిన వైసిపి అభ్యర్థులు, ఎమ్మెల్సీ ఎన్నికల నాటికి గ్రాడ్యుయేట్లు అవ్వడం జగన్ ప్రభుత్వంలోనే సాధ్యమని విమర్శించారు.

దొంగ ఓటర్ల జాబితాలో నిజమైన గ్రాడ్యుయేట్లు ఉన్నారని నిర్ధారించే ధైర్యం అధికారులకు ఉందా? అని ప్రశ్నించారు. చిత్తూరు, తిరుపతి కలెక్టరు, తిరుపతి ఎస్‌పి, రెండు జిల్లాల ఎన్నికల అధికారులందరూ వైసిపి ప్రభుత్వ కుట్రలో భాగస్వాములేనని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి తరపున బరిలో నిలిచిన వారిలో 13 మంది నేరచరితులే అని అన్నారు. సమావేశంలో ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శులు బుచ్చి రామ్‌ప్రసాద్, లుక్కా సాయిరామ్ గౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల సంఘానికి వర్ల ఫిర్యాదు

పట్టభద్రుల ఎన్నికల్లో బోగస్ ఓట్లపై ఎన్నికల సంఘానికి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య సచివాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. తిరుపతిలో ఒక చికెన్ షాపు అడ్రస్‌తో 16 మందికి ఓటు హక్కు కల్పించారని అనంతరం మీడియాతో చెప్పారు. డేటా ఎంట్రీలో పొరపాటు వల్లే చికెన్ షాపు అడ్రస్‌తో ఓట్లు కల్పించామని తిరుపతి కలెక్టర్ చెప్పటం ఆయన స్థాయికి తగని పని అని, ఇది సిగ్గుచేటని విమర్శించారు. ఎన్నికల కమిషన్ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి ఓటర్లకు వెండి బిస్కెట్లు పంచటంపై టిడిపి, కమ్యూనిస్టు పార్టీల నేతలు పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యల్లేవని విమర్శించారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో యువకుడి హత్య

ప్రజాశక్తి - చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా

ఛత్తీస్‌గఢ్ సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్రలోని గచ్చిరోలి జిల్లాలో పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఒక యువకుడిని మావోయిస్టులు అపహరించి శనివారం హత్య చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గచ్చిరోలి జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన మస్కూర్ గ్రామానికి చెందిన సాయినాథ్ నరేష్ (26) కొన్ని సంవత్సరాలుగా గచ్చిరోలి జిల్లా కేంద్రంలో ఉద్యోగ అన్వేషణలో ఉంటున్నారు. ఈ క్రమంలో హోలీ పండుగలో పాల్గొనేందుకు తన స్వగ్రామమైన మస్కూర్‌కు నాలుగు రోజుల క్రితం వచ్చారు. నరేష్ ఒంటరిగా గ్రామ శివారులోకి వెళ్లారు. అప్పటికే గ్రామస్తుల వేషధారణలో ఉన్న మావోయిస్టులు ఆయనను అపహరించి అడవుల్లోకి తీసుకెళ్లారు. అక్కడ ప్రజా కోర్టు నిర్వహించారు. పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడని నిర్ధారించి తుపాకితో కాల్చి చంపారు. మృతదేహాన్ని గ్రామ శివారులో రోడ్డుపై వదిలి వెళ్లిపోయారు.

ఇద్దరు పాలస్తీనా యువకుల కాల్చివేత

- ఇజ్రాయిల్ దాష్టీకం

జెరూసలెం: ఇజ్రాయిలీ దళాలు, సెటిలర్ల కాల్పుల్లో ఇద్దరు పాలస్తీనా యువకులు శుక్రవారం చనిపోయారు. పాలస్తీనా భూ భాగాన్ని అన్యాయంగా ఆక్రమించుకోవడమే గాక, పాలస్తీనీయులపై ఉగ్రవాదులు అన్న ముద్ర వేసి ఇష్టానుసారంగా కాల్చి చంపుతున్న ఇజ్రాయిలీ దుర్మార్గాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారమే ఈ ఏడాది ఇంతవరకు 81 మంది పాలస్తీనీయులు ఇజ్రాయిల్ సైన్యం కాల్పుల్లో చనిపోయారు. ఈ ప్రాంత వార్తా సంస్థ వాఫా (డబ్ల్యుఎఫ్ఎ) తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం ఇజ్రాయిలీ దళాల ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని కార్నే పట్టణంలో అక్రమ సెటిల్మెంట్ వెలుపల ఓ ఇజ్రాయిలీ సెటిలర్ అబ్దుల్ కరీమ్ బడే షేక్ (21) అనే పాలస్తీనా యువకుడిపై అకారణంగా కాల్పులు జరిపాడు. తూటా ఛాతిలోంచి దూసుకెళ్లడంతో కరీమ్‌ను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కరీమ్ కుటుంబం వుంటున్న సనిరియా టౌన్‌పై ఇజ్రాయిలీ సైన్యం నిరంతరం దాడులు చేస్తూనే ఉంటుంది. కరీమ్ ఇంటిని ఆర్మీ ధ్వంసం చేసింది. వెస్ట్‌బ్యాంక్‌లోని కల్కిలియాలో 16 ఏళ్ల అమీర్ మామూ ఓదెను ఇజ్రాయిల్ సైన్యం కాల్చి చంపింది.

పంచాయతీలపై విద్యుత్ భారం వేయొద్దు

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పంచాయతీలకు నిధులివ్వకుండా ఎండగట్టడమే కాకుండా ఉన్న నిధులను కూడా విద్యుత్ బిల్లులకు చెల్లించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, ఇప్పటికే దారి మళ్లించిన నిధులనూ పంచాయతీలకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలకు చెందాల్సిన 14, 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.1,244 కోట్లను మినహాయించుకుందని, దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా ఆగిపోవడమే కాక చిన్నపాటి పనులు కూడా చేయలేని దుస్థితిలోకి పంచాయతీలు వెళ్లాయని తెలిపారు. సర్పంచులు కొద్దికాలంగా ఆందోళనలు చేస్తున్నా వారి అభిప్రాయాన్ని ప్రభుత్వం, ముఖ్యమంత్రి కనీసం పరిగణనలోకి కూడా తీసుకోకపోవడం సరైంది కాదని పేర్కొన్నారు. పైగా ఉన్న కొద్దిపాటి నిధులనూ విద్యుత్ బకాయిల కింద జమచేయాలని ఆదేశించడం గర్హనీయమన్నారు. ఆర్థిక సంఘం నిధులిచ్చేందుకు సర్పంచులు అంగీకరించకపోవడంతో ఏ నిధులుంటే ఆ నిధులు చెల్లించాలని ఉత్తర్వులు ఇవ్వడం పంచాయతీల పీక నులమడం తప్ప మరొకటి కాదని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చెక్‌పవర్ ఉన్న ఏకైక ప్రజాప్రతినిధి సర్పంచి మాత్రమేనని, వారి హక్కులనూ కాలరాయడం ఏమాత్రమూ సమంజసం కాదని వివరించారు. నిధుల వినియోగానికి సర్పంచుల సంతకం తప్పనిసరి కావడంతో వారిని పక్కనబెట్టి అధికారుల ద్వారా వ్యవహారం నడిపేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని సూచించారు. ఇప్పటికే జమచేసుకున్న నిధులను తిరిగి పంచాయతీలకిచ్చి ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైద్య బృందం

రమేష్ ఆస్పత్రిలో అరుదైన వ్యాధికి శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులోని రమేష్ ఆస్పత్రికి అరుదైన ఘనత దక్కింది. అత్యంత అరుదైన మెదడు రక్తనాళానికి బైపాస్ సర్జరీని విజయవంతం చేసి రోగి ప్రాణాలను కాపాడారు. గుంటూరుకు చెందిన వాసిరెడ్డి సుజాత (69) కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ అకస్మాత్తుగా కుర్చీలో నుంచి కింద పడిపోయి స్పృహ కోల్పోయారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను రమేష్ హాస్పిటల్స్ (గుంటూరు)కు తరలించారు. అక్కడ ఆమెకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఎడమవైపు ఉండే మెదడుకు రక్తాన్ని తీసుకెళ్లే ధమనిలో 90 శాతానికిపైగా పూడిపోయి ఉండటాన్ని గుర్తించారు. సుజాత మెదడుకు తీసుకువెళ్లే ధమనిలో పూర్తిగా కాల్షియం పేరుకుపోయి ఉండడంతో సీనియర్ కార్డియాలజిస్టులు డాక్టర్ హరిత, వైద్యులు రామారావు, జయరాం పాయ్, కుమార్ వేలు, బికాస్ సాహూలతో కూడిన వైద్య బృందం కెరోటిడ్ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించింది. సాధారణంగా గుండెకు వెళ్లే రక్తనాళాలకు, పొట్ట, కాళ్ళు, చేతులలో ఉన్న రక్త నాళాలకు బైపాస్ సర్జరీ నిర్వహిస్తుంటారు. కానీ అత్యంత క్లిష్టమైన మెదడుకు వెళ్లే రక్తనాళాలకు బైపాస్ సర్జరీ నిర్వహించడం చాలా అరుదుగా జరుగుతుందని సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ జయరాం పాయ్ తెలిపారు. శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ వ్యాధిని నిర్ధారించడం, అత్యంత క్లిష్టమైన కెరోటిడ్ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ చికిత్సను విజయవంతంగా నిర్వహించినందుకు వైద్య బృందాన్ని అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - గూడూరు (తిరుపతి)

మూడు నెలలుగా జీతాలు అందకపోవడం, మున్సిపల్ కమిషనర్ తీరు భరించలేక, అప్పులతో కుటుంబాన్ని నెట్టుకురాలేక పారిశుద్ధ్య కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నారు. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. తిరుపతి జిల్లా గూడూరు మున్సిపల్ పరిధిలోని 29వ వార్డులో నివసిస్తున్న దందోలు శ్రీనివాసులు(35) నాలుగేళ్లుగా గూడూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడుగా పనిచేస్తున్నారు. మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో ఇటీవల సిఐటియు ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు సైతం చేశారు. ఎన్నిసార్లు కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదు. అప్పులతో కుటుంబాన్ని పోషించలేక ఐదురోజుల క్రితం పురుగుల మందు తాగారు. తిరుపతిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు.

హైదరాబాద్‌కు అమిత్ షా

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

హకీంపేటలో ఆదివారం జరగనున్న సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) 54వ రైజింగ్ డే పరేడ్‌కు హాజరయ్యేందుకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శనివారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు బిజెపి నాయకులు జితేందర్ రెడ్డి, ఈటల రాజేందర్, పొంగులేటి సుధాకర్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- బోర్డు కార్యదర్శి శేషగిరి బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎంవి శేషగిరి బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 10,03,990 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వీరికోసం 1,489 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రకటించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 4,84,197 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,19,793 మంది హాజరవుతారని వెల్లడించారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లను పరీక్ష కేంద్రాలకు తీసుకురావాలని ఆదేశించారు. ప్రిన్సిపల్స్‌ను సంప్రదించి హాల్ టిక్కెట్లు పొందాలని తెలిపారు. పరీక్షలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ 18004257635 నెంబరుకు సంప్రదించాలని సూచించారు. పరీక్షలను పూర్తిస్థాయి సిసి కెమెరాల నిఘాలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

This may be published in Newspapers and TV from the day following the last date for withdrawal of candidature and up to two days before the date of poll

Format C-1

(For Candidate to publish in newspapers, TV)

Declaration about criminal cases

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) no.536 of 2011 (Public Interest Foundations & ORS. Vs. Union of India &Anr.)

Name and address of Candidate:**BOMMI ISRAEL**

Name of Political Party:**YUVAJANA SRAMIKA RYTHU CONGRESS PARTY**
(Independent candidates should write "Independent" here)

Name of Election:**MEMBER OF LEGISLATIVE COUNCIL**

*Name of Constituency: **AMALAPURAM ASSEMBLY CONSTITUTENCYNo.44**

I **BOMMI ISRAEL** (Name of Candidate), a candidate for the above mentioned election; declare for public information the following details about my criminal antecedents:

(A) Pending Criminal Cases

Sl.No	Name of Court	Case No. and dated	Status of Case(s)	Section(s) of Acts concerned and brief description of offence(s)
1	JFCM COURT, AMALAPURAM	CRIME No.265/2016	Pending	U/s.341, 188, r/w. 143 IPC - Wrongful confinement
2	JFCM COURT, AMALAPURAM	CRIME No.134/2016	Pending	Sec. 7 of Criminal Law Amendment Act – Confinement and intimidation
3	JFCM COURT, AMALAPURAM	CRIME No. 158/2016 numbered as CC 759/2017	Pending	U/s. 354, 354(A), 354(B) 324 r/w.34 IPC – Outraging modesty of women and causing hurt

(B) Details about cases of conviction for criminal offences

S.No.	Name of Court & date(s) of order(s)	Description of offences(s) & punishment imposed	**Maximum Punishment Imposed**
	NIL	NIL	NIL

*In the case of election to Council of States or election to Legislative Council by MLA's, mention the election concerned in place of name of constituency. **BOMMI ISRAEL**

ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘం అధ్యక్షులుగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘం అధ్యక్షులుగా సంసాని శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ప్రభుత్వ రెవెన్యూ భవన్‌లో శనివారం ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టివి ఫణి పేర్రాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్ష స్థానానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు సంసాని శ్రీనివాసరావు పేరును మాజీ అధ్యక్షులు డిఎస్ కొండయ్య ప్రతిపాదించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన శ్రీనివాస రావును ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అభినందించారు. డ్రైవర్ల సంఘం సమస్యల పరిష్కారానికి తమ సహకారం ఎల్లప్పుడూ అందిస్తామన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
గవర్నర్‌పేట బ్రాంచి : కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520002

ఈ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి ఆధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు / హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, లాంఛనాత్మక స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి అమ్మకం **"ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల నుండి **ది. 30-04-2021 నాటికి రావలసిన బకాయి మొత్తం రూ. 19,00,406.28 /- (అక్షరాలా పంధొమ్మిది లక్షల నాలుగు వందల ఆరు రూపాయల ఇరవై ఎనిమిది పైసలు మాత్రమే)** మరియు కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి వారిచే** ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 28-03-2023**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది :** ఈ-వేలం ప్రారంభానికి ముందు

ఋణగ్రహీతలు : శ్రీ వేమూరు వెంకటేశ్వర్లు, తండ్రి : శ్రీ విశ్వేశ్వరరావు, డి.నెం. 29-28-5, దాసరి వారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ.

ఆస్తి వివరములు :

సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 3070/2013, తేది : 18-05-2013 : శ్రీ వేమూరు వెంకటేశ్వర్లు తండ్రి : విశ్వేశ్వరరావు గారి పేరిట విజయవాడ, విజయవాడ రూరల్, ప్రసాదంపాడు, డి.నెం. 5-84, అసిస్ట్ నెం. 479, ఆర్.ఎస్.నెం. 57/7 నందు అవిభక్తవాటా 32.0 చ॥గ॥లతో కలిపి మొత్తం 484.00 చ॥గ॥ల విస్తీర్ణంలో రాజగోపాల్ టవర్స్ గ్రూప్ హౌస్ నందు 935 చ॥అ॥ల విస్తీర్ణంతో మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం. ఎఫ్ఎఫ్.-3. **అపార్ట్‌మెంట్‌కి హద్దులు : ఉత్తరం :** ఇతరులకు చెందిన ఆస్తి, **దక్షిణం :** రోడ్డు, **తూర్పు :** ఇతరులకు చెందిన ఆస్తి, **పడమర :** మండవ వెంకట రత్న కుమార్ గారి ఆస్తి, **ఫ్లాట్‌కి హద్దులు : ఉత్తరం :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము, **తూర్పు :** శూన్యాకాశము, **పడమర :** కామన్ కారిడార్,

రిజర్వు ధర : రూ. 19,84,000/- ధరావత్తు : రూ. 1,98,400/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం **https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : www.unionbankofindia.com** నందు చూడగలరు. **అధీకృత అధికారి/ ఛీఫ్ మేనేజర్** గారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు అధీకృత అధికారి **మొబైల్ నెం. 7386868114 & టెలిఫోన్ నెం. 0866-2578274. Mail ID: ubin0801453@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత /సహబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 10-03-2023 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి

దక్షిణమధ్య రైల్వే

మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు. ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఇ-వేలం లీజింగ్ ద్వారా గుంటూరు డివిజన్ కలిపి అందించే వాణిజ్య సంపాదన కొరకు నెలవారీ జాబిత

PUB/0247

భారత రాష్ట్రపతి మరియు ఎస్ఆర్. డివిజినల్ కమర్షియల్ మేనేజర్, సౌత్ సెంట్రల్ రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరు తరపున ఇ-వేలం లీజింగ్ ఐఆర్ఇపిఎస్ మోడ్యూల్ వెబ్ పోర్టల్ ద్వారా ఇ-బిడ్లను ఆహ్వానించడమైనది. ప్రచురించబడిన క్యాటరింగ్ జాబితా వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

డి క్యాటగరీ స్టేషన్ వద్ద జనరల్ మైనర్ యూనిట్స్ (జిఎమ్‌యుఎస్)

క్ర. సం	ఒప్పందం రకం	స్టేషన్/స్థానం	కొరకు రిజర్వు	ఒప్పంద పదవీకాలం	ఇఎమ్‌డి విలువ	వేలం ప్రారంభ తేది మరియు సమయం
1	టీ స్టాల్	నరసరావుపేట (ప్లాట్‌ఫారం నం.2 మరియు 3)	స్త్రీ-సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 28-03-2023
2	జ్యూస్ బార్	వినుకొండ (ప్లాట్‌ఫారం నం.1)	సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 28-03-2023
3	టీ స్టాల్	దొనకొండ (ప్లాట్‌ఫారం నం.1)	సాధారణ-ఎఫ్ఎఫ్/ డబ్ల్యూడబ్ల్యూ/ఆర్ డబ్ల్యూ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 28-03-2023
4	టీ స్టాల్	మార్కాపురం రోడ్డు (ప్లాట్‌ఫారం నం.2 మరియు 3)	ఎఫ్ఎఫ్/డబ్ల్యూడబ్ల్యూ/ ఆర్‌డబ్ల్యూ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 28-03-2023
5	జ్యూస్ బార్	సత్తెనపల్లి (ప్లాట్‌ఫారం నం.1)	స్త్రీ-సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 28-03-2023
6	టీ స్టాల్	మాచర్ల (ప్లాట్‌ఫారం నం.1)	సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 28-03-2023
7	టీ స్టాల్	రేపల్లె (ప్లాట్‌ఫారం నం.1)	సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 28-03-2023

డి క్యాటగరి స్టేషన్ వద్ద ప్రత్యేక మైనర్ యూనిట్స్ (ఎస్ఎమ్‌యుఎస్)

క్ర. సం	ఒప్పందం రకం	స్టేషన్/స్థానం	కొరకు రిజర్వు	ఒప్పంద పదవీకాలం	ఇఎమ్‌డి విలువ	వేలం ప్రారంభ తేది మరియు సమయం
1	జ్యూస్ బార్	ఖంబం (ప్లాట్‌ఫారం నం.1)	ఎస్‌సి-ఎఫ్ఎఫ్/ డబ్ల్యూడబ్ల్యూ/ఆర్‌డబ్ల్యూ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 29-03-2023
2	టీ స్టాల్	సత్తెనపల్లి (ప్లాట్‌ఫారం నం.2 మరియు 3)	ఓబిసి-స్త్రీ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 29-03-2023
3	జ్యూస్ బార్	నడికుడి (ప్లాట్‌ఫారం నం.1)	ఎస్‌టి-సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 29-03-2023
4	టీ స్టాల్	పిడుగురాళ్ల (ప్లాట్‌ఫారం నం.2)	ఓబిసి-సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 29-03-2023
5	టీ స్టాల్	దొనకొండ (ప్లాట్‌ఫారం నం.2 మరియు 3)	ఓబిసి-సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 29-03-2023

ఇ మరియు ఎఫ్ క్యాటగరీ స్టేషన్ల వద్ద సాధారణ మైనర్ యూనిట్స్/ప్రత్యేక మైనర్ యూనిట్లు (జిఎమ్‌యుఎస్/ఎస్ఎమ్‌యుఎస్)

క్ర. సం	ఒప్పందం రకం	స్టేషన్/స్థానం	కొరకు రిజర్వు	ఒప్పంద పదవీకాలం	ఇఎమ్‌డి విలువ	వేలం ప్రారంభ తేది మరియు సమయం
1	టీ స్టాల్	సావల్యాపురం (ప్లాట్‌ఫారం నం.1)	స్త్రీ-సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
2	టీ స్టాల్	కురుచేడు (ప్లాట్‌ఫారం నం.1)	మానసిక మరియు భౌతిక దివ్యాంగులు	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
3	టీ స్టాల్	గజ్జెలకొండ (ప్లాట్‌ఫారం నం.1)	సాధారణ- ఎఫ్ఎఫ్/ డబ్ల్యూడబ్ల్యూ/ఆర్‌డబ్ల్యూ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
4	టీ స్టాల్	చిట్యాల (ప్లాట్‌ఫారం నం.1)	స్త్రీ-సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
5	టీ స్టాల్	రామన్నపేట (ప్లాట్‌ఫారం నం.1)	సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
6	టీ స్టాల్	పేరేచర్ల (ప్లాట్‌ఫారం నం.1)	ఎస్‌సి-సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
7	టీ స్టాల్	తర్లుపాడు (ప్లాట్‌ఫారం నం.1)	ఓబిసి-సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
8	టీ స్టాల్	పెదకొరుపాడు (ప్లాట్‌ఫారం నం.1)	మైనారిటీ-స్త్రీ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
9	టీ స్టాల్	విష్ణుపురం (ప్లాట్‌ఫారం నం.1)	ఎస్‌సి-స్త్రీ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
10	టీ స్టాల్	చినరావూరు (ప్లాట్‌ఫారం నం.1)	ఓబిసి-స్త్రీ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
11	టీ స్టాల్	పల్లికోన (ప్లాట్‌ఫారం నం.1)	ఎస్‌సి-సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
12	టీ స్టాల్	భట్టిప్రోలు (ప్లాట్‌ఫారం నం.1)	మైనారిటీ-ఎఫ్ఎఫ్/ డబ్ల్యూడబ్ల్యూ/ఆర్‌డబ్ల్యూ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
13	టీ స్టాల్	గురుజాల గేట్ (ప్లాట్‌ఫారం నం.1)	ఓబిసి-స్త్రీ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023
14	టీ స్టాల్	రెంటచింతల (ప్లాట్‌ఫారం నం.1)	ఓబిసి-సాధారణ	5సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 31-03-2023

సైకిల్/స్కూటర్/మోటార్‌సైకిల్/పార్కింగ్ స్టాండ్ యొక్క ఆపరేషన్ మరియు నిర్వహణ

క్ర. సం	ఒప్పందం రకం	స్టేషన్/స్థానం	ఒప్పంద పదవీకాలం	ఇఎమ్‌డి విలువ	వేలం ప్రారంభ తేది మరియు సమయం
1	సాధారణ పార్కింగ్ స్టాండ్	నడికుడి (ఎన్‌డికెడి)	3 సంవత్సరాలు	5శాతం బిడ్ విలువ	11:00 hrs of 24-03-2023

ఇ-టెండర్‌లో పాల్గొనేందుకు డిజిటల్ సంతకం సర్టిఫికేట్ పొందడం మరియు ఐరెప్స్ 'ఇ' వేలం లీజింగ్‌లో తమను తాము నమోదు చేసుకోవడం టెండరర్ యొక్క బాధ్యత. ఐరెప్స్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ మరియు 'ఇవేలం లీజింగ్‌లో పాల్గొనడానికి ముందస్తు అవసరాలు **www.ireps.gov.in** పోర్టల్ యొక్క మాన్యువల్ మరియు మార్గదర్శకాల క్రింద అందుబాటులో ఉన్నాయి. టెండరర్లు అవసరమైన పత్రాలను పిలిచినప్పుడు సంతకం చేసిన కార్యాలయంలో సమర్పించాలి. టెండర్‌కు సంబంధించి అవసరమైన పత్రాల చెల్లింపు లేదా అప్‌లోడ్ సమయంలో ఐరెప్స్ పోర్టల్‌లో ఏర్పడే ఏదైనా అడ్డంకికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు. టెండర్ ఫారంలో నిర్దేశించిన అన్నీ షరతులను నెరవేర్చకుండా స్వీకరించిన టెండర్లు తిరస్కరించబడతాయి. పై టెండర్ యొక్క పూర్తి వివరాలు **www.ireps.gov.in** పోర్టల్ యొక్క ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్‌లో అందుబాటులో ఉన్నాయి.

A0358 ఎస్ఆర్. డివిజినల్ కమర్షియల్ మేనేజర్, గుంటూరు

తప్పుచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎన్నికల కమిషన్‌కు అజశర్మ ఫిర్యాదు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గంలో వెండి నాణేల పంపిణీని అడ్డుకోవడంలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రులైన ఓటర్లకు పంచడానికి ఆర్‌కె బీచ్ వద్ద ఉన్న వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి కార్యాలయంలో వేల సంఖ్యలో వెండి నాణేలను సిద్ధం చేశారన్న విషయం తెలిసిన వెంటనే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున కొంతమంది మెజిస్టిక్స్ టవర్స్ వద్దకు వెళ్లారని పేర్కొన్నారు. అక్కడ కొంతమంది వెండి నాణేలను ఓటర్లకు పంచేందుకు ఏర్పాట్లు చేస్తున్న విషయాన్ని గుర్తించి వెంటనే నగర పోలీస్ కమిషనర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా, పోలీసులు, అధికారులు సకాలంలో స్పందించకపోవడం తగదన్నారు. మహారాణిపేట తహశీల్దార్ పోలీసులతో కలిసి అక్కడికి వచ్చి, తనిఖీలు నిర్వహించకపోగా, ఫిర్యాదుదారులను భద్రత పేరుతో అక్కడ నుంచి పంపించేశారని తెలిపారు.

అధికార పార్టీ అభ్యర్థి అకృత్యాలను కప్పి పుచ్చడానికి, పోలీసులు ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాలా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఓటర్లకు పంచేందుకు భారీగా డబ్బులు ఏర్పాటు చేసినట్లు కూడా తెలుస్తోందన్నారు. మీడియా సమక్షంలో మ్యాజిస్టిక్ టవర్స్ సిసి కెమెరాల ఫుటేజీలను చూసి, వాస్తవాలను నిర్ధారించాలని కోరారు. ఫిర్యాదుతో పాటు ఒక వీడియో, 2 ఫొటోలను జత చేసినట్లు ఆజశర్మ తెలిపారు.

తిరుపతిలో అఖిలపక్షం ర్యాలీ

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించాలని, దొంగ ఓటర్లపై కేసులు పెట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం తిరుపతిలో ర్యాలీ నిర్వహించారు. సిపిఎం, సిపిఐ, టిడిపి, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, టిడిపి తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు జి. నరసింహ యాదవ్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నగేష్ మాట్లాడారు. తిరుపతిలో ఏడువేల దొంగ ఓట్లు ఉన్నాయని, వీటిని అరికట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత లేని వారికి ఓటు హక్కు కల్పించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బూత్‌ల వారీగా దొంగ ఓటర్లను గుర్తించామని, వారు ఓటు వేయడానికి వస్తే పోలీసులు కేసు నమోదు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అర్హత కలిగిన ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పండి : రామకృష్ణ

ప్రజాశక్తి - గుంతకల్లు (అనంతపురం)

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులను అడుగడుగునా అణచివేస్తూ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న సిఎం జగన్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఓటర్లను కోరారు. శనివారం ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్లు వేయనీయకుండా ప్రత్యర్థి పార్టీలను వైసిపి అడ్డుకుందని చెప్పారు. ఇతర పార్టీల నేతలు నామినేషన్లు వేసేందుకు మారువేషాల్లో వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చాయంటే రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఉపాధ్యాయులకు రూ. ఐదువేలు, పట్టభద్రులకు రూ.రెండు వేలను వైసిపి నేతలు పంచుతున్నారని ఆరోపించారు. శాసన మండలి అవసరం లేదని అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపిన జగన్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు ఓటు వేయమని అడిగే అర్హత లేదన్నారు. నియంతృత్వ వైసిపి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు మండలి ఎన్నికలు మంచి అవకాశం అని ఓటర్లకు సూచించారు. పశ్చిమ రాయలసీమ స్థానం నుంచి పోటీ చేసిన పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రైవాడ ప్రాజెక్టును పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు, లోకనాథం తదితరులు

'రైవాడ' రైతులకు నీరివ్వాలి

- ప్రాజెక్టును సందర్శించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-దేవరాపల్లి, అనకాపల్లి జిల్లా

రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసిన రైవాడ రైతులకు సాగునీరు కూడా అందివ్వకపోవడం దుర్మార్గమని, వారికి తక్షణమే నీరివ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. రైవాడ ప్రాజెక్టును సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శనివారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అనకాపల్లి జిల్లా వి.మాడుగుల నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు పుష్కలంగా ఉన్నాయని, అందులో కీలకమైనది రైవాడ ప్రాజెక్టు అని తెలిపారు. వేలాది ఎకరాలకు సాగునీరు, విశాఖపట్నం ప్రజల దాహార్తిని తీరుస్తున్న ప్రాజెక్టు ఇంతటి అధ్వానంగా ఉండడం దారుణమన్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించే అవకాశం ఉన్నా పాలకులు పట్టించుకోలేదని తెలిపారు. రైతులను నిర్లక్ష్యం చేసిన ఏ ప్రభుత్వానికీ మనుగడ ఉండదన్నారు. ఈ బడ్జెట్‌లోనైనా సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, రిజర్వాయర్‌ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పెద్దేరు ఎడమ కాలువను పూర్తి చేసి గిరిజనులకు సాగునీరు అందించాలని, ఇందు కోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు గండి నాయనబాబు, సిపిఎం మండల కార్యదర్శి బిటి.దొర తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలున్న అధికారులపై వేటు

- తిరుపతి కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎన్నికల విధుల్లో అలసత్వం వహించిన సంబంధిత ఉద్యోగులను తొలగించామని తిరుపతి కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఒకే ఇంటి నంబర్‌తో ఎక్కువ ఓట్లు ఉన్నాయని, బోగస్ సర్టిఫికెట్లు పెట్టారని వివిధ రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. దరఖాస్తులలో ఉన్న అడ్రస్‌లను పరిశీలిస్తే ఆ ఓటర్లు ఉన్నారని నిర్ధారణ అయ్యిందన్నారు. డేటా ఎంట్రీలో తప్పులు రావడానికి కారణమైన తిరుపతి అర్బన్ ఎఇఆర్ఓ వెంకట రమణ, డిప్యూటీ కమిషనర్ చంద్ర మౌళీశ్వర్‌రెడ్డి, ఆరుగురు బిఎల్‌ఒలను ఎన్నికల విధులు నుండి తప్పించామని తెలిపారు. గెజిటెడ్ అధికారుల అటెస్టేషన్ సర్టిఫికెట్లు ఉన్న వాటిని ఓటర్ జాబితాలో ఉంచడం జరిగిందనీ, సదరు ఓటరు తప్ప వేరే వారు దొంగ ఓటు వేయడానికి వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఫిర్యాదుల నేపథ్యంలో తిరుపతిలోని 14 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా పరిగణించామని తెలిపారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కే యత్నం

- బిఆర్ఎస్ ఎపి అధ్యక్షులు తోట చంద్రశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు దర్యాప్తు సంస్థల్ని ఉసిగొల్పుతోందని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర్ ఆరోపించారు. విజయవాడ బందరు రోడ్డులోని ఓ హోటల్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి కానీయకుండా బిజెపి కుట్ర చేస్తోందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించకుండా రాష్ట్రాన్ని బిజెపి నిర్లక్ష్యం చేస్తోందన్నారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాల పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. రూ.లక్షల కోట్లు గ్లోబల్ సమ్మిట్‌లో ఎంఒయులు కుదిరాయని చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. రాష్ట్రంలో 2024 ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లో బిఆర్ఎస్ పోటీ చేస్తుందన్నారు. మీడియా సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు కొణిజేటి ఆదినారాయణ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
అసెట్ రికవరీ బ్రాంచి (79170) విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్.అప్పారావు స్ట్రీట్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520001

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

{సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1)}

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: మెస్సర్స్ లలితా మెడికల్ అండ్ జెఇఇ అకాడమీ,** డి.నెం.3-1-93/ఎ, రాజేంద్రనగర్, 1వ లైను, గుంటూరు-522006. **సహ ఋణగ్రహీత: శ్రీ జొన్నలగడ్డ పేరయ్య, తండ్రి: నాగేశ్వరరావు,** డి.నెం.3-1-93/ఎ, రాజేంద్రనగర్, 1వ లైను, గుంటూరు-522006, **శ్రీమతి జొన్నలగడ్డ వేణుకుమారి, భర్త: పేరయ్య,** డి.నెం.3-1-93/ఎ, రాజేంద్రనగర్, 1వ లైను, గుంటూరు-522006, **హామీదారు: శ్రీ జొన్నలగడ్డ నాగేశ్వరరావు, తండ్రి: పేరయ్య,** డి.నెం.1-80-3, బోరుపాలెం గ్రామము, తుళ్ళూరు మండలం, గుంటూరు-522237 వారు **01.04.2021 తేదీనాటికి** చెల్లించవలిసిన బకాయిమొత్తం **రూ.1,07,53,233.53/- (అక్షరాల ఒక కోటి ఏడు లక్షల యాభైమూడు వేల రెండు వందల ముప్పైమూడు రూపాయలు మరియు యాభై మూడు పైసలు మాత్రమే)** + వడ్డీ + బ్యాంక్ ఛార్జీలు సదరు నోటీసు తేదీనుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.05.06.2021న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 8 ప్రకారము **07 మార్చి 2023 తేదీన** దిగువ పేర్కొన్న **ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమును ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా **01.04.2021 తేదీనాటికి చెల్లించవలిసిన బకాయిమొత్తం రూ.1,07,53,233.53/- (అక్షరాల ఒక కోటి ఏడు లక్షల యాభైమూడు వేల రెండు వందల ముప్పైమూడు రూపాయలు మరియు యాభై మూడు పైసలు మాత్రమే)** + వడ్డీ + బ్యాంక్ ఛార్జీలు మొ॥ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి. సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) చట్టం ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరు.

తనఖావుంచిన ఆస్తి వివరములు

1) రిజిష్టర్డ్ దెవ్ అగ్రిమెంట్ నెం.4105/2018, తేది:06.08.2018 ప్రకారము **శ్రీ జొన్నలగడ్డ నాగేశ్వరరావు, తండ్రి: పేరయ్య పేరునగల ఆస్తి.** గుంటూరు జిల్లా, ఎపి క్యాపిటల్ సిటీ ఏరియా, తుళ్ళూరు మండలం, బోరుపాలెం సబ్‌డివిజన్, బోరుపాలెం, కాలనీ నెం.288, బ్లాక్ నెం.1837, యస్.నెం.123 నందు 1620 చ॥గ॥ విస్తీర్ణముగల ప్లాట్ నెం. 3-62-288-1937-39-D7 & ప్లాట్ కోడ్ నెం. 3-288-1837-39-D7 ఖాళీ ఇంటి స్థలమునకు సంబంధించిన యావదాస్తి. **ఆస్తికి హద్దులు: తూర్పు:** 25 మీ॥ రోడ్డు; **పడమర:** 15.6 మీ॥ రోడ్డు; **ఉత్తరం:** రెసిడెన్షియల్ ఖాళీస్థలము; **దక్షిణం:** రెసిడెన్షియల్ ఖాళీస్థలము.

తేది : 07-03-2023 సం/- అధీకృత అధికారి, అసెట్ రికవరీ బ్రాంచి,
ప్రదేశము : విజయవాడ విజయవాడ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ICICI Home Finance
కార్పోరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, అందేరి -కుర్లా రోడ్, అందేరి (ఈస్ట్), ముంబాయి-400059, ఇండియా
శాఖ కార్యాలయం: సుప్రియ టవర్స్, 1వ అంతస్తు, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002

[రూల్ 8(6)కు నిబంధన చూచుట]

స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ ది సెక్యురీటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యురిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు. సెక్యూర్డ్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్ధతిన" మరియు "ఏదిఏమైనా ఆవిధంగా" విక్రయించబడునని సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది, సంక్షిప్త వివరాల ప్రకారం దిగువ ఇవ్వబడినాయి;

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీతలు/ హామీదారులు/చట్టబద్ధ వారసులు. లోను ఖాతా సం.	తెలిసిన రుణభారాలతో సెక్యూర్డ్ అస్సెట్(ల) వివరాలు, ఏవైనా	మొత్తం బకాయిలు	రిజర్వ్ ధర/- / బయానా మొత్తం	ఆస్థి తనిఖీ తేది మరియు సమయం	వేలం తేది & సమయం
(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)
1.	కట్టమూరి ఏడుకొండలు (రుణగ్రహీత) కట్టమూరి కీర్తి (సహ రుణగ్రహీత) కట్టమూరి ప్రమీళ (సహ రుణగ్రహీత) లోను ఖాతా నం.LHGTR00001336715 మరియు LHGTR00001336732	ఫ్లాట్ నం.జి1 డో.నం.522 ఎ ఫ్లాట్ నం.7,8,9,10 కాకుమను టవర్స్ ఎస్‌వికె డెవలపర్స్ గ్రౌండ్ ఫ్లోర్ నరసరావుపేట గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522601.	Rs. 21,49,882/- March 08, 2023	Rs. 23,33,250/- / Rs. 2,33,325/-	April 10, 2023 11AM - 3PM	April 13, 2023 2PM - 3PM

మా వేలం ఏజెన్సీ గ్లోబ్ టెక్ వెబ్‌సైట్ **(URL Link-https://BestAuctionDeal.com)** మీద ఆన్‌లైన్ వేలం నిర్వహించబడును. 12 ఏప్రిల్,2023న సా.5.00 గం.లలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించుటకు తనాఖదారులు/నోటీసు ఇవ్వడమైనది లేకపోతే ఈ సెక్యూర్డ్ అస్సెట్స్ పైన షెడ్యూల్ ప్రకారం విక్రయించబడును.

కాగోరు బిడ్డర్(లు) బయానా (ఇఎండి) ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) (కాలమ్న్ ఇ చూచుట) ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, సుప్రియ టవర్స్, 1వ అంతస్తు, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002 లేదా 12 ఏప్రిల్, 2023న సా.04:00 గం.లలోపు దాఖలు చేయాలి. దయచేసి గమనించండి, కాగోరు బిడ్డర్(లు) ఒకవేళ పైన పేర్కొన్న సమయం ప్రకారం వారి ఆఫర్ దాఖలు చేయనట్లయితే ఆప్పుడు టెండర్ డాక్యుమెంట్‌ల యొక్క సంతకంచేసిన కాపీ ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, సుప్రియ టవర్స్, 1వ అంతస్తు, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002 లేదా 12 ఏప్రిల్, 2023న సా.05:00 గం.లలోపు దాఖలు చేయాలి. బయానా డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) "ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడడ్-ఆక్షన్" పేరిట ఏదైనా జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి గుంటూరు వద్ద చెల్లించాలి.

తనిఖీకి సంబంధించిన ఏదైనా తదుపరి వివరణలకు, వేలం నియమాలు మరియు షరతులు లేదా టెండర్ల దాఖలు, 7021072869 మీద ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను దయచేసి సంప్రదించండి.

అధీకృత అధికారి ఎలాంటి కారణం చూపకుండా అన్ని బిడ్‌లు లేదా ఏదైనా తిరస్కారం చేసే హక్కు కలదు. విక్రయం వివరాణాత్మక నియమాలు మరియు షరతులు, **https://www.icicihfc.com/** దయచేసి చూడండి..

తేది: 12 మార్చి, 2023, **ఆధీకృత అధికారి**
ప్రదేశం: గుంటూరు. **ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్**

National Sugar Institute, Kanpur - 208017
An ISO 9001:2015 Certified Institute
(A Premier Institute of Government of India)
Admission Notice-2023

National Sugar Institute, Kanpur, Ministry of Consumer Affairs, Food and Public Distribution, Government of India for following Courses invites applications from eligible candidates who wish to seek admission for the academic session 2023-24.

SL. No.	Course offered	Eligibility	No. of Seats	Mode of Selection
1.	P.G. Diploma Course of Associateship of National Sugar Institute in Sugar Technology[ANSI (ST)]	B.Sc. with Chemistry. Physics & Mathematics or Bachelor's Degree in Chemical. Engineering or B.Sc. (Sugar Science & Technology) awarded by SNSI Belgavi or Graduation in Food Technology	66	Admission Test
2.	P.G. Diploma Course of Associateship of National Sugar Institute in Sugar Engineering [ANSI (SE)]	Bachelor's Degree or A.M.I.E (from The Institutions of Engineers, India) in Mechanical / Production / Electrical./ Electrical & Electronics	40	Admission Test
3.	P. G. Diploma Course in Industrial Fermentation and Alcohol Technology[DIFAT]	B.Sc. with Chemistry / Applied Chemistry./ Industrial Chemistry/Bio-Chemistry as one of the subject or B. Tech. in Bio-Technology/ Chemical Engg. or Bio-Chemical Engg.	50	Admission Test
4.	P.G. Diploma Course in Sugarcane Productivity & Maturity Management [DSPMM]	B. Sc. / B.Sc. Agriculture	20	Admission Test
5.	P.G. Diploma Course in Instrumentation & Process Control [DIPC]	Bachelor's Degree or A.M.I.E (from The Institutions of Engineers, India) in Electronics & Instrumentation/Electronics/ Instrumentation/ Electrical & Electronics/ Applied Electronics & Instrumentation/Electronics & Communication/ Instrumentation & Control/B.Sc. (Electronics)	17	Admission Test
6.	P. G. Diploma Course in Quality Control And Environmental Science [DQCES]	B.Sc. with Physics, Chemistry, Mathematics or Zoology, Botany, Chemistry / B.Sc. with Environmental Science/B.Sc. (Bio-Technology) or / B.Tech (Bio-Technology).	22	Admission Test
7.	Sugar Boiling Certificate Course [SBCC]	Matriculate/ High School with Science/ Agriculture Exp:- One season (of minimum 90 days) experience of pan-operation in a vacuum pan sugar factory along with nomination	63	Admission Test
8.	Sugar Engineering Certificate Course [SECC]	Diploma in Mechanical / Production / Electrical./ Electrical & Electronics from a recognized Technical School/Polytechnic.	17	Admission Test
9.	Certificate Course in Quality Control [CCQC]	12th Standard in Science (Physics, Chemistry and Mathematics).	30	Admission Test
10.	Fellowship of N.S.I. in Sugar Technology or Sugar Chemistry	A.N.S.I. (Sugar Tech.) / AVSI (Sugar Tech.) — Note:- Application for F.N.S.I. in Sugar Technology & Sugar Engineering should be sponsored by a sugar factory/allied unit for carrying out the research pertaining to this course. Similarly, application for F.N.S.I. in Fermentation Technology should be sponsored by a distillery or brewery industry or allied unit for carrying out the research work pertaining to this course.	As per requirement	Personal Interview
11.	Fellowship of N.S.I. in Sugar Engineering	A.N.S.I. (Sugar Engg.) / AVSI (Sugar Engg.)		
12.	Fellowship of N.S.I. in Fermentation Technology	D.I.F.A.T. / I.F.A.T. from VSI		

For courses at Sl. No 1, 2, 3, 4, 5, 6, 8 & 9 above, final year appearing candidates may also apply.
For applying On-line, visit our website at http://nsi.gov.in and follow the instructions.
For reservation of seats in different courses- refer N.S.I. prospectus.

IMPORTANT DATES AND INFORMATION FOR APPLICANT

On- line submission of application forms	From 10th April, 2023 onwards
Last date for submission of on-line Applications (Foreign Candidates)	5th May' 2023 upto 5:00 PM
Last date for submission of on-line Applications (Indian Candidates)	26th May' 2023 upto 5:00 PM
Last date for receipt of downloaded printout of duly filled & signed on line application forms at NSI Kanpur by hand or by post (Indian Candidates)	2nd June' 2023 upto 5:00 PM
Application Fee –For all candidates except SC/ST	Rs. 1500/-
Application Fee – for SC /ST Candidates	Rs. 1000/-
Application fee to be sent in the form of DD drawn in favour of	"Director, National Sugar Institute" payable at Kanpur
Downloading of Admit Cards from website by Indian applicants	From 16th June' 2023 onwards
Admission Test (Only for Indian Candidates)	25th June' 2023 (Sunday) at Pune, Chennai, Delhi, Kanpur, Kolkata, Patna, Meerut & Gorakhpur etc.
Address for all Correspondence / Submission of application form by Registered Post / Speed Post	Director, National Sugar Institute, Kalyanpur, Kanpur-208017, India
For further details and Prospectus visit website:	http://nsi.gov.in. Contact us: nsikanpur.edu@gmail.com

NOTE- All rights for change in the above schedule and examination centres are reserved with the Institute and can be made any time without giving any notice to anyone.

cbc 08202/12/0005/2223

సంపాదకీయం

మతిమరుపు!

ఈగ కథ చాలా మందికి గుర్తుండే వుంటుంది. ఒకరోజు ఇల్లు అలుకుతుండగా, ఈగ తన పేరు మర్చిపోతుంది. తన పేరేమిటో తెలుసుకుందామని పెరట్లోకి వస్తుంది. అక్కడ లేగదూడ ఎదురౌతుంది. దాన్ని ఆపి-'ఛెంగున ఎగిరే లేగమ్మా/ నా పేరేమిటో చెప్పమ్మా' అంటుంది. నాకేం తెలుసు, మా అమ్మనడుగు అంటుంది. ఈగ ఎగురుతూ వెళ్లి ఆవు ముందు వాలుతుంది. 'ఛెంగున ఎగిరే లేగమ్మా/ లేగను కన్నా ఆవమ్మా/ నాపేరేమిటో చెప్పమ్మా' అంటుంది. చివరకు ఎలాగో తెలుసుకుంటుంది. ఈగలాగే ఓ ఇల్లాలూ ఇల్లలుకుతూ తన పేరు మర్చిపోయింది. 'నా పేరేమిటి?' అని తెగ ఆలోచించింది. ఎదురింటి గోడకు వేలాడే నేమ్‌బోర్డులోని పేరులాగే నాకూ ఓ పేరుండాలే అని, తన పిల్లల్ని అడుగుతుంది. భర్తను అడుగుతుంది. తల్లిదండ్రులనూ అడుగుతుంది. తనను ముద్దుగా పిలిచే పేరు తప్ప అసలు పేరేమిటో ఎవరూ చెప్పలేదు. దారిలో కనిపించిన తన చిన్ననాటి స్నేహితురాలు 'శారదా' అని పేరుపెట్టి పిలవడంతో... తన పేరేమిటో తెలుస్తుంది. అలెక్స్ హేలీ 'రూట్స్'లో తన పూర్వీకుల చరిత్ర తెలుసుకోడానికి పడినంత తాపత్రయం...పి.సత్యవతి రాసిన 'ఇల్లలకగానే పండగౌనా?' కథలోని ఈమె కూడా అంతే తాపత్రయ పడుతుంది. ఇల్లు, పిల్లలు, భర్త సేవలో తలమునకలై... తన అస్తిత్వాన్ని, పేరును కూడా మర్చిపోతుంది. ఇక 'భలే భలే మగాడివోయ్' సినిమాలో హీరో మతిమరుపుతో ఎదుర్కొనే సమస్యలు అన్నీఇన్నీ కావు.

సాధారణంగా నిత్యజీవితంలో ఏదో చెయ్యాలనుకొని మర్చిపోవడం, ఎంతకీ గుర్తురాకపోవడం చాలామంది ఎదుర్కొనే సమస్యే. 'మతి చెడితే గతి చెడుతుంది. గతి చెడితే గమ్యం చెడుతుంది' అన్నది సామెత. మతిమరుపు చాలా రకాలుగా కనిపిస్తుంది. మానసికంగా ఎక్కువ ఇబ్బందులు కలిగిస్తుంది. కూరలో వేసే ఉప్పు దగ్గర నుంచి కట్టుకునే బట్టల వరకూ ఏదీ సక్రమంగా చేయలేని పరిస్థితి ఎదురవుతుంది. నిర్ణయాలు తీసుకునే శక్తి సన్నగిల్లుతుంది. తనవల్ల ఇతరులకు కలిగే ఇబ్బందినీ గుర్తించలేరు. మాట్లాడుతున్నప్పుడు పదాల కోసం వెతుక్కోవడం, చదువుతున్నప్పుడు విషయం అర్థం కాకపోవడం, మాటిమాటికి వస్తువుల కోసం వెతుక్కోవడం, వస్తువులు పోయాయని అంటుండడం, బయటికి వెళ్లినప్పుడు తిరిగి రావడానికి ఇబ్బందిపడటం, క్రమంగా తన సన్నిహితులను సైతం గుర్తించలేకపోవడం వంటివి జరుగుతుంటాయి. తాజాగా దేశంలో 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు వున్న కోటి మందికి పైగా వృద్ధులు మతిమరుపుతో బాధపడుతున్నారని 'న్యూరో ఎపిడెమియాలజీ' జర్నల్ వెల్లడించింది. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ వంటి దేశాలతో పాటు భారత్‌లోనూ ఈ వ్యాధి అధికంగానే వుంది. 2050 నాటికి దేశంలో 60 ఏళ్లు నిండినవారు మొత్తం దేశ జనాభాలో 19.1 శాతం వుంటారని అంచనా. వృద్ధుల జనాభా పెరుగుదలతో పాటు ఈ వ్యాధి బాధితులు కూడా పెద్ద సంఖ్యలో పెరుగుతారు. ముఖ్యంగా మహిళలు, నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారు.

మనిషి అంటేనే జ్ఞాపకాల సమాహారం. జ్ఞాపకాల తోడు లేకపోతే జీవితమే మోడువారుతుంది. మన ప్రతి కదలికా, ప్రతి మాటా, ప్రతి పనీ వీటితో ముడిపడే వుంటుంది. అంత కీలకమైన జ్ఞాపకశక్తిని తుడిచిపెట్టేదే మతిమరుపు. వయసు మీద పడుతున్న కొద్దీ ఎంతోకొంత మతిమరుపు సహజమే. అలాగని తేలిగ్గా కొట్టేయడానికి లేదు. 'నిన్నటి దు:ఖం జ్ఞాపకం వుంటేనే, నేటి ఆనందంలో మాధుర్యం గుబాళిస్తుంది' అంటాడో కవి. ఇవేవీ గుర్తే లేనప్పుడు ఇక మాధుర్యం గుబాళించడమనే మాటే వుండదు. ఇప్పటి జీవనశైలిలో వృద్ధులకే కాదు... పిల్లలకు, యువతకు సైతం మతిమరుపు ఒక జాడ్యంలా మారింది. జన్యుపరంగా కొందరికి త్వరగా రావొచ్చు. ఇప్పుడు చిన్న పిల్లలతో పాటు యువతలోనూ కనిపిస్తోంది. అధిక ఒత్తిడే దీనికి కారణమంటున్నారు నిపుణులు. అయితే, జీవనశైలి మార్పులతో కొంతవరకు దీన్ని అధిగమించొచ్చు. సంగీతం వినిపించడం, పుస్తక పఠనం, రాయడం, బొమ్మలు గీయడం, ఆటలు ఆడటం, పజిల్లు పూరించడం వంటివి మెదడును చురుగ్గా వుంచుతాయి, ఆలోచింపజేస్తాయి. దీనివల్ల మతిమరుపు మన దరి చేరదు. ఒక బలహీనత నుంచి మనం పారిపోలేనప్పుడు... నిలుచున్న చోటు నుంచే దానిని ఎదిరించాలి.

మహనీయుల మాట



పురుషుల శాసనపరమైన ప్రత్యేక హక్కులు...
మహిళలను దిగలాగుతున్నంత కాలం...
సమానత అనేది ఉండదు.
- వి.ఐ.లెనిన్

మోడీని కాదంటే ఇ.డి : కేంద్ర ద్వంద్వ నీతి

ప్రస్తుతం

తెలకపల్లి రవి

> **అదేపనిగా ప్రత్యర్థులపై దాడులు, దుష్ప్రచారాలతో లొంగదీసుకునే మోడీ ప్రభుత్వ పోకడలకు తోడు మీడియాలో పక్షపాత ధోరణుల వల్ల ఇడి, ఐటి, సిబిఐలను దుర్వినియోగ పరిచే త్రిశూల వ్యూహం తగినంతగా ప్రజల దృష్టికి రావడం లేదు. ప్రజాస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ పార్టీలకూ సమానమైన హక్కులు వుంటాయనే సత్యం విస్మరించబడుతున్నది. కేంద్ర దర్యాప్తు సంస్థలు స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేయాలి. గతంలోనూ వీటిపై ఆరోపణలు వున్న మాట నిజమే గాని మోడీ హయాంలో వాటిని పూర్తి కీలుబొమ్మలుగా మార్చివేయడం సత్యం.**



సిసోడియా

కవిత

తేజస్వి యాదవ్

గత నెల ప్రారంభంలో హిండెన్ బర్గ్ నివేదిక విడుదలైన తర్వాత ఒక్కసారిగా అదానీ సామ్రాజ్యం కుప్పకూలినంత పనైంది. దేశంలోనే గాక ప్రపంచ వ్యాపితంగా ఆ గ్రూపు ప్రభలు కొడిగట్టాయి. రాజకీయ పార్టీల నుంచి సుప్రీం కోర్టు వరకూ ఆందోళనతో ఆగ్రహంతో స్పందించాయి. దేశదేశాల మీడియా సంస్థలు కథనాలు ప్రకటించాయి. గౌతమ్ అదానీ ఇంతగా దేశాన్ని దగా చేయగలిగాడంటే ప్రధాని మోడీ, ఆయన ప్రభుత్వ అండదండలే కారణమని ప్రతివారూ విమర్శించారు. అదే విధంగా పార్లమెంటులోనూ ప్రతిపక్షాలు నిలదీశాయి. ఈ వ్యవహారం మొత్తం కూలంకషంగా దర్యాప్తు చేయడానికి సంయుక్త పార్లమెంటరీ సంఘం (జెపిసి) వేయాలని గట్టిగా పట్టుపట్టాయి. వారి కంఠశోష, పార్లమెంటు సమయం హరించుకుపోవడం తప్ప దమ్మిడీ ప్రయోజనం కలగలేదు. చివరలో చర్చకు సమాధానమిచ్చిన మోడీ వాటిపై సమాధానం ఇవ్వడం కాదు కదా కనీసం ఖండించడం కూడా జరగలేదు! ఎల్ఐసి, ఎస్‌బిఐల నుంచి లక్ష కోట్ల వరకూ అప్పులు ఇప్పించి అదానీని అందలమెక్కించిన కేంద్రం నిర్వాకం కనీసంగా విచారణకు నోచలేదు! దీనిపై పరిశీలనకు ఒక విచారణ కమిటిని నియమించాలని భావించిన సుప్రీం కోర్టుకు కూడా కేంద్రం సహకరించలేదు. తనుగానే అత్యున్నత న్యాయస్థానం ఒక కమిటీని వేసింది. ఈ దర్యాప్తునకు సహకరించకపోగా కేంద్రం సంస్థలు, బిజెపికి దగ్గరగా వుండే మహా కుబేరులు అదానీని కాపాడేందుకు రంగంలోకి దిగారు. అంతిమంగా అమెరికాకు చెందిన రాజీవ్ దేశాయ్ భారీ రుణమిచ్చి ఆదుకున్నారు. ఇప్పుడు ఆ గ్రూపు గట్టెక్కిందని కథనాలు వదులుతున్నారు. అదానీ చిక్కులెదుర్కొంటున్న మరో దేశం ఆస్ట్రేలియా ప్రధానిని పిలిపించి మరీ క్రికెట్ ఆట ముసుగులో మంతనాలాడి దారికి తెచ్చుకున్నారు. ఇది అస్మదీయుల సంగతి.

తస్మదీయులే లక్ష్యం

మరి తస్మదీయులైతేనో? ఢిల్లీలో లిక్కర్ స్కామ్ జరిగిందంటూ వార్తలు, లీక్‌లు వచ్చాయి. కిందటి ఏడాది నుంచి బిజెపి నేతలు దీని గురించి మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు, కెసిఆర్ కుటుంబ సభ్యులు అరెస్టు కాక తప్పదని చెబుతూ వచ్చారు. ఇంతలో ఈ కుంభకోణం విచారించాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ విజయ్ సక్సేనా సిబిఐని కోరారు. వారు రంగంలోకి దిగాక బిజెపి నేతల దాడి, దూకుడు మరింత పెరిగాయి. తెలంగాణలో ఆపరేషన్ ఫాం హౌస్ ప్రహసనం తర్వాత బిజెపి నేతల దాడి మరింత పెరిగింది. ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా అరెస్టు కావలసిందేనని బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ పలుసార్లు బెదిరించారు. తర్వాత ఈ దాడి ఎంఎల్‌సి కవితపైకి మరలింది. సౌత్ గ్రూపుగా ఏర్పడిన కొందరు వైసిపి, టిఆర్ఎస్ నాయకులు ఢిల్లీ మద్యపాన విధానాన్ని మార్పు చేసి తమకు లాభం వచ్చేలా చేసుకున్నారని ఈ క్రమంలో వంద కోట్లు ముడుపులు ముట్టాయని తెలంగాణ బిజెపి మోతమోగించింది. ఢిల్లీ లోనూ ఆప్‌ను దెబ్బ తీయడానికి ఇదే ప్రచారం మరింత తీవ్రంగా నడిచింది. కేవలం సందేహాల ఆధారంగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) రంగంలోకి దిగింది. తమ ఇల్లు మొత్తం సోదా చేసిన ఇడి ఏ ఆధారాలు దొరకలేదని ప్రకటించిందని ఇప్పుడు అరెస్టులో వున్న మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ప్రకటించారు. అయితే అది వేగంగా మారిపోయింది. ఏవో ఆధారాలు దొరికాయంటూ హైదరాబాదులో కొన్ని అరెస్టులు చేశారు. ఆ తర్వాత దీనంతటికీ సంధానకర్త కవిత అంటూ ఆమెపై దాడి మొదలెట్టారు. కవిత ఇందుకు సంబంధించిన ఫోన్లు ధ్వంసం చేశారనేది మాత్రమే వారు చెబుతున్న ఆధారం. అంటే చచ్చిపోయిన గేదె పగిలిపోయిన కుండడు పాలు ఇచ్చేదన్న చందంగానే ఈ వాదన వుంది. తమాషా ఏమంటే ఇదంతా కూడా మొదట మీడియాలో రావడం తర్వాత ఇడి, సిబిఐ రంగంలోకి దిగడం. ఆ విధంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో లిక్కర్ కంపెనీలకు మీడియా సంస్థలు లాబీయింగ్ వ్యవస్థకు సంబంధించిన పలువురిని అదుపులోకి తీసుకున్నారు. కవిత నిర్దేశకత్వంలో అరుణ్ రామచంద్ర పిళ్లై అనే ఆసామి వీరందరినీ సమన్వయం చేశారనేది సిబిఐ, ఇడి ఆరోపణ. వారిని, వారి తర్వాత సిసోడియాను అదుపులోకి తీసుకున్నారు. ఆయన తర్వాత రాజకీయ ప్రచారం ఎక్కువ చేసింది కవిత గురించే. ఆమెను రెండు మూడు సార్లు విచారించారు. ఆ సమయంలో ఉద్రిక్తత కూడా తారాస్థాయికి చేరింది. ఈ వారంలో మరోసారి విచారణకు పిలిస్తే ఆమె ఢిల్లీలో మహిళా రిజర్వేషన్ల బిల్లు గురించిన దీక్ష కారణంగా వాయిదా కోరి ఈరోజు హాజరైనారు. ఆ క్రమంలో ఆమె ఫోటోలు ప్రచురించి ఆమె చాలా భయపడుతున్నట్టు వ్యాఖ్యలు రాశారు. అనేక ఇంటర్వ్యూలు ఇచ్చిన కవిత తనకు ఈ వ్యవహారంతో ఏం సంబంధం లేదని, భయం కూడా లేదని చెబుతూ వచ్చారు. ఈ మధ్యలో ఆమె ముఖ్యమంత్రి కెసిఆర్‌తో మాట్లాడటం, వ్యూహం నిర్ణయించుకోవడం ప్రతిదీ అపహాస్యం చేశారు. స్కాం ఇప్పటికే రుజువైనట్టు, ఆమె కుటుంబం పార్టీ కూడా పద్మవ్యూహంలో చిక్కినట్టు ప్రచారం సాగింది.

పది పార్టీల అభ్యంతరం

ఈ సమయంలో ఎనిమిది పార్టీలకు చెందిన తొమ్మిది మంది నాయకులు వారిలో నలుగురు ముఖ్యమంత్రులు, అయిదుగురు మాజీలు ప్రధాని మోడీకి లేఖ రాస్తూ దర్యాప్తు సంస్థలను ప్రత్యర్థులపై నిర్బంధానికి దుర్వినియోగపర్చడం అప్రజాస్వామికమని విమర్శించారు. అదానీ ఉదంతంలో వలె బిజెపికి అనుకూలమైతే రక్షించడం, తమ పార్టీలో చేరితే వదలివేయడం ద్వంద్వనీతి అని తేల్చిచెప్పారు. లేఖపై సంతకం చేసిన బిఆర్ఎస్, ఆప్, టిఎంసి, నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన, సమాజ్‌వాది, ఆర్‌జెడి, నాయకులందరూ ఈ విధమైన వేటకు గురైనవారే, గవర్నర్లను అడ్డం పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాలతో చెలగాటమాడటం తప్పని కూడా హెచ్చరించారు (ఢిల్లీ లిక్కర్ వ్యవహారం లెఫ్టినెంట్ గవర్నర్ దగ్గరే మొదలైందని గుర్తుంచుకోవాలి. ఆ లేఖ రాసిన రోజునే తెలంగాణ గవర్నర్ తమిళిసై వివాదం రాజేయడం యాదృచ్ఛికం కాదు). ఈ లేఖలో సంతకాలు చేసిన వారంతా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారేనని ఆరోపిస్తూ దీనిపై కాంగ్రెస్, వామపక్షాల నేతల సంతకాలు లేకపోవడం గురించి ఎక్కువ చేసి చూపించారు. తర్వాత కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ విడివిడిగా మోడీకి ఇదే విషయమై లేఖలు పంపించారు. కేసుల మంచి చెడ్డలు ఏమైనా దర్యాప్తు సంస్థల తీరు పారదర్శకంగా నిష్పక్షపాతంగా లేదని పినరయి సోదాహరణంగా వ్యాఖ్యానించారు. ఇంతకూ పినరయి విజయన్ తన లేఖలో పేర్కొన్నట్టు ఈ కుంభకోణానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేదా నగదు కాదంటే డేటా దొరికినట్టు ఇంతవరకూ వెల్లడి కాలేదు. సిసోడియాను విడుదల చేయాలని కూడా స్టాలిన్ తన లేఖలో రాస్తే జరిగింది ఆయనను మరో సంస్థ ద్వారా కస్టడీలో కొనసాగించడం. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కూడా అరెస్టు చేయొచ్చని బిజెపి చోటా నాయకులు బెదిరిస్తూనే వున్నారు. ఈ లేఖల తర్వాతనే బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమార్తెల ఇళ్లపై దాడులు చేశారు. అంటే ఇదంతా కావాలని జరుగుతున్నదేనని స్పష్టమవుతుంది.

ఇదే మోడీ న్యాయం

అదేపనిగా ప్రత్యర్థులపై దాడులు, దుష్ప్రచారాలతో లొంగదీసుకునే మోడీ ప్రభుత్వ పోకడలకు తోడు మీడియాలో పక్షపాత ధోరణుల వల్ల ఇడి, ఐటి, సిబిఐలను దుర్వినియోగ పరిచే త్రిశూల వ్యూహం తగినంతగా ప్రజల దృష్టికి రావడం లేదు. ప్రజాస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ పార్టీలకూ సమానమైన హక్కులు వుంటాయనే సత్యం విస్మరించ బడుతున్నది. కేంద్ర దర్యాప్తు సంస్థలు స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేయాలి. గతంలోనూ వీటిపై ఆరోపణలు వున్న మాట నిజమే గాని మోడీ హయాంలో వాటిని పూర్తి కీలుబొమ్మలుగా మార్చివేయడం సత్యం. సిబిఐ, ఇడి లకు అధిపతులను నియమించేప్పుడు సుప్రీం కోర్టు సూచనలు తోసిపుచ్చి తమకు లోబడివుండేవారిని సర్వీసు పొడగించి మరీ ఎంపిక చేస్తున్నారు. వారిని తమ ఇష్టానుసారం వేధింపులకు పాల్పడుతున్నారు. ముందే చెప్పినట్టు అస్మదీయులకు ఒక నీతి, తస్మదీయులకు మరో నీతి అంటున్నారు. తృణమూల్ నాయకులు సువేందు అధికారి, ముకుల్ రాయ్ తమతో చేరగానే వారిపై దర్యాప్తులు ఆగిపోయాయి. తెలుగునాట కూడాకొందరు టిడిపి నేతలకు ఇదే విధమైన ఉపశమనం లభించింది. మరోవంక తమను వ్యతిరేకించే వారిపై నిరంతరాయంగా దాడులు, దర్యాప్తులు నాటకీయంగా సాగిస్తున్నారు. కేరళ వామపక్ష ప్రభుత్వంపైన ముఖ్యమంత్రిపైన కూడా బంగారం స్మగ్లింగ్ కేసు మోపాలని విఫలయత్నం చేసిన కేంద్రం దాన్ని ఏదో రూపంగా సాగదీస్తూనే వుంది. మోడీతో జోడీ లేదంటే ఇడి అన్నది ఇప్పుడు తారకమంత్రంగా మారింది. సంపన్న వ్యాపారవేత్తలు, వ్యాపారాలు గల సంపన్న రాజకీయ నేతలు స్వీయ రక్షణ కోసం బిజెపిని ఆశ్రయించితే రక్షణ దొరుకుతుందని భావిస్తున్నారు. మరోవంక మానవ హక్కుల కోసం ప్రజల కోసం పనిచేసే స్వచ్ఛంద సంస్థలతో సహా లేనిపోని దాడులకు, వేధింపులకు గురవుతున్నారు. న్యూస్ క్లిక్, క్వింట్‌తో సహా అనేక మీడియా సంస్థలను నడిపించడం దుర్భరంగా మార్చేశారు. ఇవేవీ ప్రజాస్వామిక లక్షణాలు కావు. ఇది ప్రభుత్వ పరిధులు దాటి రాజకీయపార్టీగా బిజెపి ఇష్టారాజ్యంగా మారుతున్నది.

> **చాలామంది తప్పుగా భావిస్తున్నట్టు లేదా కొందరు వ్యాఖ్యాతలు చిత్రిస్తున్నట్టు ఇది అవినీతి నిరోధానికి సంబంధించిన అంశం కాదు. అవినీతి వ్యవహారాలకు ఆధారాలుంటే పార్టీల ప్రమేయం లేకుండా ఎవరిపైనైనా చర్య తీసుకోవాల్సిందే. శిక్షలు పడాల్సిందే. కాని ఒకవైపే చూడు అన్నట్టు తస్మదీయులను ఏరికోరి ఇబ్బంది పెట్టడం, వెంటబడి వేధించడం ప్రజాస్వామ్య విరుద్ధం. మనీ లాండరింగ్ కింద కేసు నమోదు చేసే అధికారం గతంలో వలెగాక మామూలు అధికారులకు కూడా కట్టబెడుతూ చట్టాన్ని సవరించారు. ఇప్పుడు ఏ చిన్న అధికారి అయినా ఆరోపణ చేస్తే నిర్దోషిత్వం నిరూపించుకోవలసిన భారం నిందితులదే, ఇంతకన్నా తలకిందులు తర్కం మరొకటి వుండదు.**

చాలామంది తప్పుగా భావిస్తున్నట్టు లేదా కొందరు వ్యాఖ్యాతలు చిత్రిస్తున్నట్టు ఇది అవినీతి నిరోధానికి సంబంధించిన అంశం కాదు. అవినీతి వ్యవహారాలకు ఆధారాలుంటే పార్టీల ప్రమేయం లేకుండా ఎవరిపైనైనా చర్య తీసుకోవాల్సిందే. శిక్షలు పడాల్సిందే. కాని ఒకవైపే చూడు అన్నట్టు తస్మదీయులను ఏరికోరి ఇబ్బంది పెట్టడం, వెంటబడి వేధించడం ప్రజాస్వామ్య విరుద్ధం. మనీ లాండరింగ్ కింద కేసు నమోదు చేసే అధికారం గతంలో వలెగాక మామూలు అధికారులకు కూడా కట్టబెడుతూ చట్టాన్ని సవరించారు. ఇప్పుడు ఏ చిన్న అధికారి అయినా ఆరోపణ చేస్తే నిర్దోషిత్వం నిరూపించుకోవలసిన భారం నిందితులదే, ఇంతకన్నా తలకిందులు తర్కం మరొకటి వుండదు. దురదృష్టవశాత్తూ దీనికి సుప్రీం కోర్టు ఆమోదం కూడా పొందారు. కనకనే ప్రతిపక్షాలు సుప్రీంకోర్టుకు దీనిపై లేఖ రాసి పున:పరిశీలన కోరాయి. విచ్చలవిడిగా ఇడి కేసులు, దాడులు పెరగడానికి ఇదో ముఖ్య కారణం. కేసుల జాప్యం దీనికి తోడు. ఇటీవల న్యాయస్థానాలు కూడా ఇలాంటి తప్పు పోకడలను గుర్తించినా కేంద్రం వైఖరిలో మార్పు లేదు. ఆధారాలున్న అక్రమాలను చట్టప్రకారం విచారించి కోర్టుల ముందుంచాలి. అంతేగాని తామే తీర్పరులై దండనాయకులై ప్రతిపక్షాలపై విరుచుకుపడి లొంగదీసుకోచూడటం సహించరానిది.

గల్ఫ్ గతినే మార్చేస్తున్న చైనా వ్యూహం !

అంతర్జాతీయం

అమన్

ప్రపంచ పరిణామాల్లో అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టే పరిణామాలు జరుగుతున్నాయి. మధ్య ఆసియాలో రెండు శిబిరాలుగా ఉన్న సౌదీ అరేబియా, ఇరాన్ ఒకే గూటికి చేరడం దానికి ఓ ఉదాహరణ. చైనా రాజధాని బీజింగ్‌లో జరిగిన చర్చల్లో ఇరుదేశాల మధ్య ఒప్పందం జరిగింది. దౌత్య సంబంధాల పునరుద్ధరణ, ఇరు దేశాల్లోనూ రాయబార కేంద్రాలు ప్రారంభించడానికి ఇరువురూ అంగీకరించారు.

దశాబ్దాల వైరం

ప్రపంచంలోనే ఆయిల్ ఉత్పత్తిలో సౌదీ అరేబియాది కీలక స్థానం. రెండవ ప్రపంచ యుద్ధం నాటి నుంచి అమెరికాతో సన్నిహితంగా ఉంటోంది. ఏడు దశాబ్దాలుగా అమెరికాకు ఆయిల్ అందిస్తోంది. అందుకు గాను అమెరికా నుంచి ఆయుధాలు అందుకుంటోంది. గల్ఫ్ దేశాల మధ్య అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తోంది. అమెరికా విరోధులందరితో కయ్యానికి దిగడం గానీ, అమెరికాకు వంత పాడడం గానీ చేస్తోంది.

ఆ క్రమంలోనే ఇరాక్ యుద్ధంలో కీలక పాత్ర పోషించిన సౌదీ అరేబియా 1980ల నుంచి ఇరాన్‌తో వైరం కొనసాగిస్తోంది. సిరియా, లెబనాన్ వంటి దేశాల్లో అమెరికా దురాక్రమణలకు అండగా నిలిచింది. ఆయా దేశాల్లో అమెరికా దళాలకు అవసరమైన అన్ని రకాల సహాయం సౌదీ నుంచి అందుతోంది. ఇరాన్ కూడా జోక్యం చేసుకోవడంతో సౌదీ, ఇరాన్ మద్దతుదారులు అక్కడ పోరు సాగిస్తున్నారు. అంతేగాకుండా ఇరాన్ నుంచి పలుమార్లు క్షిపణి దాడులు కూడా సౌదీ ఎదుర్కొంది. ఇరు దేశాల్లోనూ రాయబార కార్యాలయాలను ముట్టించే స్థితి వరకూ సాగింది. దాంతో 2016లో ఇరువురూ రాయబార కార్యాలయాలను మూసుకున్నారు. సంబంధాలు పూర్తిగా తెంచుకున్నారు.

చైనా చొరవతో...

మధ్య ఆసియాలో పెత్తనం కోసం రెండు శిబిరాలుగా ఉన్న సౌదీ, ఇరాన్ మధ్య పెత్తనం కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది అమెరికాకు అలుసుగా మారింది. ఇజ్రాయిల్ సహాయంతో ఇప్పటికే పాలస్తీనా మీద నిత్యం



దాడులు సాగిస్తోంది. సిరియాను సైతం వదిలిపెట్టడం లేదు. ఇటీవల ఇరాన్ మీద కూడా దాడులకు పూనుకుంది. అమెరికా చేతిలో పావుగా ఉన్న ఇజ్రాయిల్‌లో పూర్తి మితవాద నెతన్యాహూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దాడులు ఇంటా, బయటా పెరిగాయి.

అదే సమయంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఆయిల్ ధరల విషయంలో సౌదీ అరేబియాకి అమెరికాతో వివాదం ఏర్పడింది. ఆయిల్ ధరలు పెరగకుండా అమెరికా అడ్డుకుంటోంది. దాన్ని సౌదీ నిరసిస్తోంది. ఈ పరిణామాలతో చైనా రంగంలో దిగింది. చైనాకి చాలాకాలంగా ఇరాన్ తో సన్నిహిత సంబంధాలున్నాయి. సౌదీతో ఇటీవల దౌత్యపరంగా దగ్గరయ్యింది. చైనా అధ్యక్షుడు సౌదీ అరేబియాలో పర్యటించారు. సౌదీ బృందం చైనా వెళ్లింది. ఆయిల్ ధరలపై అమెరికా పెత్తనంతో రగిలిపోతున్న సౌదీ అరేబియా నేరుగా చైనా, రష్యాలకు చేరువయ్యింది.

ఇరాన్, సౌదీ అరేబియా మధ్య వివాదం ఉంటేనే అమెరికా ఆటలు సాగుతాయి. చమురు ఉత్పత్తిలో పెద్ద దేశాలను విభజించి పాలించేలా అమెరికా సాగుతోంది. చైనా మాత్రం దానికి భిన్నంగా సౌదీ, ఇరాన్ మధ్య స్నేహం చిగురించేందుకు చొరవ చూపింది. ఫలితంగా ఇరుదేశాల మధ్య మార్చి 10న బీజింగ్‌లో జరిగిన ఒప్పందం గల్ఫ్ దేశాల మధ్య కొత్త సమీకరణాలకు తోడ్పడతాయి. అంతేగాకుండా ప్రపంచ రాజకీయాలను మరో దిశకు మళ్లిస్తాయి.

చమురుతో అమెరికాకి చెక్

ప్రపంచ రాజకీయాల్లో ఆధిపత్యానికి చమురు అత్యంత కీలకం. తాజా పరిణామాలతో ఆయిల్ ఫీల్డ్‌లో ఆధిపత్యం కలిగిన రష్యా, ఇరాన్‌తో పాటుగా సౌదీ అరేబియా కూడా అమెరికాకి దూరంగా జరగడం గమనార్హం. చైనాలో ఒప్పందం చేసుకోవడానికి ముందురోజు సౌదీ అరేబియా విదేశాంగ మంత్రి రష్యా వెళ్లి అక్కడి ప్రభుత్వ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. దాంతో మూడు పెద్ద దేశాలు ఐక్యం అయితే ముడి చమురు వ్యవహారాల్లో అమెరికా ఆధిపత్యానికి చెక్ పడుతుంది.

> **జియో పాలిటిక్స్‌లో చైనా పాత్ర పెరుగుతుండడం, ఆయిల్ రంగంలో అమెరికా ఆశలకు గండిపడడంతో పాటుగా ఇప్పుడు ఉద్రిక్తతలు తగ్గితే అమెరికా ఆయుధ వ్యాపారానికి కూడా ఆటంకం అవుతుంది. ముఖ్యంగా సౌదీ-ఇరాన్ ఒప్పందం కారణంగా సిరియా, లెబనాన్ సంక్షోభాలకు తెరపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దానికి అనేక చిక్కుముడులు వున్నప్పటికీ తాజా పరిణామం కీలక అడుగులకు దారితీస్తుంది. అదే జరిగితే గల్ఫ్‌లో శాంతి ఏర్పడుతుంది. ఇజ్రాయిల్ దూకుడుకు ఇతర అరబ్ దేశాల మధ్య ఏర్పడే సఖ్యత సమాధానం అవుతుంది.**

దశాబ్దాల పాటు చమురుబావులను తన చెప్పుచేతల్లో పెట్టుకుని ప్రపంచ రాజకీయాలను శాసించిన అమెరికాకు ఇప్పుడు అక్కడే సవాళ్లు అనివార్యం అవుతాయి. లాటిన్ అమెరికా లోని వెనిజులా వంటి ఆయిల్ నిల్వలు అత్యధికంగా ఉన్న దేశాలు ఇప్పటికే అమెరికాకి కొరుకుడు పడడం లేదు. ఇప్పుడు సౌదీతో ఇరాన్ చేతులు కలపడం వైట్ హౌస్‌కి మరింత కలవరపరిచే అంశం. బీజింగ్‌లో జరిగిన ఒప్పందంతో అవాక్కయిన అమెరికా వెంటనే స్పందించడానికి కూడా సిద్ధపడలేదంటే ఎంతటి షాక్ తిన్నదో అర్థం చేసుకోవచ్చు.

బీజింగ్ వైపు ప్రపంచం చూపు

ఇప్పటికే ఆఫ్రికా ఖండంలోని అత్యధిక దేశాలతో చైనా వ్యాపార సంబంధాలను దౌత్యబంధంగా మార్చుకుంది. మూడొంతుల దేశాల్లో చైనా కార్యకలాపాలకు అడ్డంకి లేకుండా సాగుతోంది. లాటిన్ అమెరికాలో సైతం బ్రెజిల్, అర్జెంటీనా సహా అన్ని దేశాలకు చైనా సన్నిహితంగా మారుతోంది. ఇప్పుడు గల్ఫ్‌లో కూడా చైనా ప్రభావం పెరగబోతోంది. రెండు కీలక శిబిరాలకు నాయకత్వం వహించే ఇరాన్, సౌదీలను ఒక్కటి చేయడంలో చైనా రాయబారం నెరపడంతో పెద్దన్న పాత్ర బీజింగ్ వైపు మళ్లుతుందా అనే అభిప్రాయానికి ఆస్కారం ఇస్తోంది.

అనేక దేశాల రాయబార వ్యవహారాల్లో జోక్యం చేసుకుని, తన ప్రయోజనాకలు అనుగుణంగా మలచుకున్న అమెరికాకి భిన్నంగా, గల్ఫ్‌లో ఐక్యత పెంచి, ముస్లిం దేశాల మధ్య సానుకూలతను పాదుకోల్పడంలో చైనా వ్యవహరించిన తీరు అందరినీ ఆకర్షిస్తోంది. ముఖ్యంగా షియా, సున్నీ జాతులకు ప్రాతినిధ్యం వహించే దేశాలను సైతం సన్నిహితంగా మలచడంలో సక్సెస్ కావడం ద్వారా చైనా పట్టు పెరుగుతుందనడంలో సందేహం లేదు.

ఉద్రిక్తతలు తొలగితే అమెరికాకు దెబ్బే

జియో పాలిటిక్స్‌లో చైనా పాత్ర పెరుగుతుండడం, ఆయిల్ రంగంలో అమెరికా ఆశలకు గండిపడడంతో పాటుగా ఇప్పుడు ఉద్రిక్తతలు తగ్గితే అమెరికా ఆయుధ వ్యాపారానికి కూడా ఆటంకం అవుతుంది. ముఖ్యంగా సౌదీ-ఇరాన్ ఒప్పందం కారణంగా సిరియా, లెబనాన్ సంక్షోభాలకు తెరపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దానికి అనేక చిక్కుముడులు వున్నప్పటికీ తాజా పరిణామం కీలక అడుగులకు దారితీస్తుంది. అదే జరిగితే గల్ఫ్‌లో శాంతి ఏర్పడుతుంది. ఇజ్రాయిల్ దూకుడుకు ఇతర అరబ్ దేశాల మధ్య ఏర్పడే సఖ్యత సమాధానం అవుతుంది.

అదే సమయంలో సౌదీ నుంచి ఆయిల్ కొనుగోలు చేసే చైనా తన దేశం నుంచి వివిధ రకాల వస్తువులతో పాటుగా ఆయుధాలను కూడా ఎగుమతి చేయడం ఖాయం. ఇరాన్ నుంచి కూడా సౌదీ అరేబియా కి ఆయుధాల సరఫరా జరుగుతుంది. ముఖ్యంగా న్యూక్లియర్ విషయంలో ఇరాన్ ద్వారా సౌదీకి మేలు జరుగుతుందనే అంచనాలున్నాయి. అది అమెరికాకి అత్యంత పెద్ద సమస్య అవుతుంది. అన్ని వైపులా ఆధిపత్యానికి గండి కొడుతుంది. చివరకు తన దేశ ఆర్థిక రంగానికే ఛాలెంజ్ గా పరిణమిస్తుంది. దాంతో ఈ ఒప్పందాన్ని అమెరికా జీర్ణం చేసుకోలేని స్థితి ఏర్పడుతోంది. అందుకే ఎలాంటి ఎత్తులతో శాంతియుత వాతావరణాన్ని చెడగొట్టే యత్నం చేస్తుంది, దానికోసం ఎంతకైనా తెగించే అమెరికన్ సామ్రాజ్యవాద ధోరణి ఎలాంటి ఎత్తులు వేస్తుందన్నది చూడాలి.

జనవాక్యం

కష్టాల్లో పాడిరైతులు!

రాష్ట్ర వ్యాప్తంగా పశుసంవర్ధక శాఖలో 30,000 పోస్టులు భర్తీ కావల్సి ఉంది. గత నాలుగు సంవత్సరాలుగా ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో పశువులకు వైద్యం అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు పశువుల బీమా బకాయిలు రూ.200 కోట్లకు చేరుకున్నాయి. సహకార పాల డైరీలకు పాలు విక్రయించే పాడి రైతులకు లీటరుకు నాలుగు రూపాయల సబ్సిడీ ఇస్తామన్న హామీ అటకెక్కించారు. దాణా, గడ్డి ధరలు పెరిగి పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పాడి రైతుల దుస్థితిని ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోక పోవడం దురదృష్టకరం!

- జి.రామకృష్ణ,ముస్తాబాద, కృష్ణా జిల్లా.

కవిత్వం

కూలి ఈగలు

గోడ మీద పిల్లులు
గుంభనంగా ఉన్నాయి
ఎన్నికల సమయంలో
ఎటువైపు దూకాలా అని.
ఊసర వెల్లులు
స్తబ్ధుగా ఉన్నాయి
ఎన్నికల తరుణంలో
ఏ రంగు మార్చాలా అని.
మేక వన్నెపులులు
మౌనంగా ఉన్నాయి
ఎన్నికల తరువాత
ఏ స్వభావాన్ని చూపాలా అని.
కూలి ఈగలు
పని చేసుకుని పోతున్నాయి
గెలుపు, ఓటములు
ఓటరు దేవుడే నిర్ణయిస్తాడని.

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
సెల్ : 7780277240

త్రిపురలో వివిధ ప్రాంతాల్లో బిజెపి గూండాల దాడుల్లో ధ్వంసమైన ఇళ్లను, దుకాణాలను పరిశీలిస్తున్న ఎంపిల బృందం, వీరితో పాటు త్రిపుర మాజీముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ కూడా పలు ప్రాంతాల్లో పర్యటించి బాధితులను ఓదార్చారు

బరితెగించిన బిజెపి మూకలు

- ఎంపీల బృందంపై రాళ్ల దాడి, వాహనాలకు నిప్పు
- పలు వాహనాల ధ్వంసం - అతికష్టం మీద బయటపడ్డ ఎంపీలు
- బిజెపి హింసాకాండ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

త్రిపురలో బిజెపి గూండాలు మరోమారు రెచ్చిపోయారు. ఈ దఫా ఏకంగా పార్లమెంటు సభ్యుల బృందంపైనే దాడికి బరితెగించారు. కాన్వాయ్‌పై రాళ్ల వర్షం కురిపించారు. జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై అని నినాదాలు చేస్తూ దాదాపు 30 మంది గూండాలు ఎంపిలు ప్రయాణించిన కారుకు నిప్పు పెట్టారు. పోలీసులు చూస్తుండగానే మరో రెండు కార్లును ధ్వంసం చేశారు. ఎంపిలపైనా దాడికి పాల్పడ్డారు.

త్రిపురలో మార్చి 2న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత వామపక్ష, కాంగ్రెస్ కార్యకర్తలపై బిజెపి పెద్ద ఎత్తున హింసాకాండకు పాల్పడింది. ఈ దాడులు జరిగిన ప్రాంతాలను పరిశీలించేందుకు సిపిఎం రాజ్యసభ పక్షనేత ఎలమరం కరీం నేతత్వంలోని ఏడుగురు ఎంపిలతో కూడిన నిజ నిర్ధారణ బందం రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం నాడు అగర్తలకు చేరుకుంది. బందంలో సిపిఎం ఎంపిలు బికాష్ రంజన్ భట్టాచార్య, పిఆర్ నటరాజన్, ఎఎ రహీమ్, సిపిఐ ఎంపి బినోయ్ విశ్వం, కాంగ్రెస్ ఎంపిలు రంజితా రంజన్, అబ్దుల్ ఖలీక్ ఉన్నారు. వీరంతా మూడు బందాలుగా సెపాహిజాల, గోమతి, పశ్చిమ త్రిపుర, ఖోవై, ధలై జిల్లాల్లోని వివిధ ప్రాంతాలను సందర్శించారు.

పక్కా ప్రణాళికతో భయోత్పాతం

ఎన్నికల అనంతరం బిజెపి గూండాలు సాగించిన హింసాకాండలో పశ్చిమ త్రిపుర జిల్లా బిషాల్‌గఢ్‌లోని నేహాల్ చంద్రనగర్ మార్కెట్‌లో దాదాపు 20 షాపులు దగ్ధమయ్యాయి. ఈ ప్రాంతాన్ని సిపిఎం ఎంపి ఎలమరం కరీంతో పాటు కాంగ్రెస్ ఎంపి అబ్దుల్ ఖలీఖ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితేందర్ చౌదరి, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి అజోయ్ కుమార్, ప్రతప్‌గఢ్ ఎమ్మెల్యే రాముదాస్, పిసిసి అధ్యక్షులు బ్రిజిత్ సిన్హా ఇతర ఎమ్మెల్యేలు సందర్శించారు. నేతలను లక్ష్యంగా చేసుకుని భయానక వాతావరణం సష్టించిన బిజెపి గూండాలు ప్రణాళికాబద్ధంగా హింసకు పాల్పడ్డారు. మోహన్‌పూర్‌లో సందర్శనకు వెళ్లిన సిపిఎం ఎంపిలు బికాష్ రంజన్ భట్టాచార్య, ఎఎ రహీం, కాంగ్రెస్ ఎంపి రంజితా రంజన్ బందం ప్రయాణించే వాహనంపై బిజెపి గూండాలు దాడికి ప్రయత్నించారు. సెక్యూరిటీగా ఉన్న పోలీసులు మౌనం దాల్చారు. దీంతో పోలీసుల వైఖరిపై ఎంపిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్, సిపిఎం ఎంపి పిఆర్ నటరాజన్, సిపిఐ ఎంపి బినయ్ విశ్వంలతో కూడిన బందం పశ్చిమ త్రిపురలోని బర్జాలా, బముతియా నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించింది.

పది రోజుల్లో వెయ్యికి పైగా దాడులు

ఎంపీల బృందం పరిశీలనలో అనేక దిగ్భ్రాంతికర వాస్తవాలు బయటపడ్డాయి. ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ పూర్తిగా విఫలం కావడంతో ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై పది రోజుల్లోనే బిజెపి గూండాలు వెయ్యికి పైగా దాడులకు పాల్పడ్డారు. వందలాది మంది కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు 700 ఇళ్లు కాలిపోయాయి. ధ్వంసమయ్యాయి. వామపక్ష, కాంగ్రెస్ మద్దతుదారులకు చెందిన రబ్బరు తోటలు, ఇతర వ్యవసాయ పంటలను బిజెపి గూండాలు కాల్చివేశారు. వందలాది ఆవులు, గేదులతో పాటు ఇతర పశువులు కాలి బూడిదయ్యాయి. సిపిఎం ఎమ్మెల్యేలు, నేతల ఇళ్లలోకి చొరబడి, ధ్వంసం చేసినా, కాల్చి వేసినా బిజెపి ప్రభుత్వం ఎవరినీ అరెస్టు చేయలేదు. దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం, పోలీసులు మౌనం దాల్చరని బాధితులు నిజనిర్ధారణ బృందం సభ్యులతో వాపోయారు. బిజెపి ముఠాలు తగులబెట్టిన ఇళ్ల ముందు నేతలతో మాట్లాడుతుండగా పలువురు బాధితులు కన్నీరు మున్నీరు అయ్యారు. ఇన్నాళ్లు కట్టుకున్న ఇల్లు, పొదుపు చేసుకున్న వనరులు కళ్లముందే బూడిదగా మారాయని బాధితులు గుండెలవిసేలా ఆవేదనను వ్యక్తం చేశారు. ఎంపి ఎలమరం కరీం బందం బిలాస్‌గఢ్ సబ్ డివిజన్‌లోబధార్‌ఘట్, నేహాల్ చంద్రానగర్ నియోజకవర్గాల్లో చరిపర, గజారియా, కాంపర్‌బజార్‌లలో బాధితులను పరామర్శించింది. ఎంపి బికాష్ రంజన్ భట్టాచార్య బందం మోహన్‌పూర్ సబ్ డివిజన్‌లో కల్ కలియా, హరినాఖోలా నియోజకర్గాల్లోనందన్ నగర్, హషిపరా, అబోయ్ నగర్ తదితర ప్రాంతాల్లో బాధితులను కలుసుకున్నారు. ఎంపి పిఆర్ నటరాజన్, బినోయ్ విశ్వం బందం సదర్ సబ్ డివిజన్‌లోని బర్జాలా, నర్సింగ్‌ఘడ్, మోహన్‌పూర్ సబ్ డివిజన్‌లోని బముతియా, దుర్గాబరి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. ఈ బందం దుర్గాబరి, గాంధీగ్రామ్, ఉషాబజార్, కాళికాపూర్, రాంనగర్ వంటి ప్రాంతాలకు చేరుకుని బాధితుల్లో విశ్వాసాన్ని నింపింది.

గవర్నర్‌కు వినతి

దాడులు నేపథ్యంలో ఎంపిల బందం శనివారం తమ పర్యటనను వాయిదా వేసుకుంది. అనంతరం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ సత్యదేవ్ నారాయణ్ ఆర్యను కలిసి వినతిపత్రం సమర్పించింది. సోనార్టరి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బందం సభ్యులు మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ సభ్యులు, కార్యాలయాలపై బిజెపి ఎన్నికల అనంతర హింసాకాండపై తమ ఆందోళన వ్యక్తం చేశామని ఎలమరం కరీం తెలిపారు. ప్రజల జీవితాలను, జీవనోపాధిని రక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. హింసాకాండతో ప్రతిపక్ష ఎంపిల బందాన్ని తిప్పికొట్టగలమన్నది బిజెపి భ్రమ మాత్రమేనన్నారు. ఈ హింసాకాండను పార్లమెంటులో లేవనెత్తుతామని అన్నారు. నాయకులపై దాడులు చేసి కార్యకర్తల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా బిజెపి వ్యవహరిస్తోందని సిపిఐ ఎంపి బినోయ్ విశ్వం అన్నారు.

దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి: సిపిఎం

బిషాల్‌ఘర్‌లోని నేహాల్‌చంద్ర నగర్‌లో ప్రతిపక్ష ఎంపిల బందంపై బిజెపి చేసిన దారుణమైన దాడిని సిపిఎం తీవ్రంగా ఖండించింది. బిజెపి భయోత్పాత రాజకీయాలు కొనసాగిస్తోందని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. బాధితులతో మాట్లాడుతుండగా ఎంపిల వాహనాలు ధ్వంసమయ్యాయంటే అక్కడి పరిస్థితి ఎంత భయానకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు అని ఆయన పేర్కొన్నారు. ఈ అప్రజాస్వామ్యక చర్యలను ప్రజలంతా ఖండించాలని ఆయన కోరారు. మరోవైపు ఎంపీల బృందంపై దాడికి పాల్పడిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శివర్గం డిమాండ్ చేసింది. హింస వెనుక ఉన్న వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది.

ఎంపిలపై దాడి హేయం : పినరయి విజయన్

త్రిపురలో పర్యటించిన ప్రతిపక్ష ఎంపిల నిజనిర్ధారణ బందంపై సంఘ్ పరివార్ గూండాలు చేసిన దాడి హేయమైనదని, ఇది తీవ్రంగా ఖండించదగినదని కేరళ ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్ అన్నారు. ఈ దుర్మార్గపు చర్య వెనుక సంఘ్ పరివార్ గూండాలు ఉన్నారని విమర్శించారు. అక్కడ శాంతిభద్రతలు పునరుద్ధరించాల్సిన అవసరాన్ని ఇది స్పష్టం చేస్తుందని, త్రిపురలో ఈ భీభత్స పాలనను ఓడించేందుకు ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని పిలుపు ఇచ్చారు. ఈ దాడిని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ కూడా తీవ్రంగా ఖండించారు. ఎంపిలపై రాళ్లు రువ్వేస్థాయికి బిజెపి బరితెగించిందన్నారు. ఈ హింసాకాండ ద్వారా ఎక్కువకాలం విజయం సాధించలేరని ఆయన పేర్కొన్నారు.

ముగ్గురి అరెస్ట్

త్రిపురలో వామపక్ష, కాంగ్రెస్ పార్లమెంటరీ ప్రతినిధి బృందంపై దాడికి సంబంధించి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు శనివారం పోలీసులు తెలిపారు. బిషాల్‌గఢ్ సబ్‌డివిజన్‌లోని సరిహద్దు గ్రామమైన నేహాల్‌చంద్ర నగర్‌లో ఎన్నికల అనంతరం బిజెపి హింసాత్మక దాడులకు తెగబడిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు ముగ్గురిని అరెస్ట్ చేశామని, ఇతర నిందితుల కోసం గాలింపు చేపడుతున్నామని సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ఈ ప్రాంతంలో భద్రతా బలగాలను మోహరించినట్లు, సీనియర్ అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని అన్నారు.

ప్రజా సమస్యలపై ప్రచార ఉద్యమం

- ఉధృత పోరాటాలే మార్గం
- ఏప్రిల్ 5న మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ
- సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు వెల్లడి

న్యూఢిల్లీ : ఉధృత పోరాటాల ద్వారానే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమని సిఐటియు, అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మికుల సంఘం (ఎఐఎడబ్ల్యుయు) పిలుపునిచ్చాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, శ్రామిక వ్యతిరేక విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, ధరల పెరుగుదలను అరికట్టాలని, ఆహారం, నిత్యావసరాలపై జిఎస్‌టిని ఉపసంహరించాలని, సంపన్నులపై పన్ను వేయాలని, కార్పొరేట్ పన్నును పెంచి, సంపద పన్నును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశాయి. కార్మికులను, రైతాంగాన్ని కొల్లగొట్టడం ద్వారా అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు అమృతకాలాన్ని అందించాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయు నేతలు తపన్‌సేన్, విజూ కృష్ణన్, బి.వెంకట్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలతో కార్మికుల రోజువారీ జీవితం దుర్భరంగా తయారైందని అన్నారు. ప్రజాస్వామ్య సంస్థలన్నీ కూడా ధ్వంసమవుతున్నాయని, ప్రజాతంత్ర హక్కులు కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి కూటమి మతోన్మాద విషాన్ని వ్యాప్తి చేస్తూ ప్రజలను విభజిస్తోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రస్తుతం సాగుతున్న పోరాటాలను మరింత ఉధృతం చేయాలని సిఐటియు, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయులు సంయుక్తంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఒకరిపట్ల మరొకరికి విద్వేషం, భయం లేని స్వేచ్ఛా వాతావరణం కావాలని, గౌరవం, భద్రతతో కూడిన జీవితాన్ని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5న మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ నిర్వహించున్నాట్లు తెలిపారు. ఈ ర్యాలీని జయప్రదం చేసేందుకు రాష్ట్ర, జిల్లా, స్థానిక స్థాయిల్లో ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశ నలుమూలల నుంచి ఢిల్లీ తరలివెళ్లి ర్యాలీని జయప్రదం చేయాలని కార్మికులు, రైతులతో సహా అన్ని తరగతుల ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు.

సంఘర్ష్ ర్యాలీ ప్రధాన డిమాండ్లు

అగ్నిపథ్ పథకాన్ని రద్దు చేయాలి. కాంట్రాక్టీకరణ కాకుండా శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించాలి. స్కీమ్ వర్కర్లతో సహా కార్మికులందరికీ నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలి. కనీస వేతనం రూ.26 వేలు వుండాలి. గ్యారంటీ సేకరణతో అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు సి2 ప్లస్ 50 శాతం తో కనీస మద్దతు ధరకు చట్టబద్ధంగా హామీ కల్పించాలి. నిరుపేద, మధ్యతరగతి రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు వన్‌టైమ్ రుణాన్ని రద్దు చేయాలి. 60 ఏళ్లు పైబడిన వారందరికీ పెన్షన్ ఇవ్వాలి. నాలుగు కార్మిక చట్టాలను, విద్యుత్ సవరణ్ బిల్లు 2022ను రద్దు చేయాలి. అందరికీ ఉపాధి భద్రత హామీ కల్పించాలి. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విస్తరించి, పనిదినాలను 200 రోజులకు పొడిగించాలి. 'ఉపాధి' కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ.600కు పెంచాలి. పెండింగ్‌లో వున్న వేతనాలన్నింటినీ చెల్లించాలి. జాతీయ పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలి.

సియుఇటి యుజి పరీక్షలకోసం దరఖాస్తుల గడువు పొడిగింపు

న్యూఢిల్లీ : కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సియుఇటి) యుజి 2023 పరీక్షల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పెంచింది. మార్చి 30 వరకు గడువును పొడిగించినట్లు యుజిసి చైర్మన్ ఎం.జగదీష్ కుమార్ తెలిపారు. సియుఇటి యుజి పరీక్షలు మే 12-31 వరకు జరగనున్నాయి. అర్హత గల అభ్యర్థులు సియుఇటి పరీక్షల కోసం దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ మార్చి 12 గా పేర్కొంది. అయితే అభ్యర్థుల కోసం ఈ గడువును ఈ నెలాఖరు వరకు పెంచుతున్నట్లు ప్రకటించారు. అర్హతలు, సిలబస్, రిజిస్ట్రేషన్ వంటి ఇతర వివరాల కోసం అభ్యర్థులు సియుఇటి (యుజి) 23 వెబ్‌సైట్‌ను పరిశీలించాలని పేర్కొన్నారు.

స్థంభించిన జమ్ము

- ఆస్తి పన్నును నిరసిస్తూ బంద్

జమ్ము : ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (సిసిఐ) పిలుపు మేరకు శనివారం నాడు జమ్ములో వాణిజ్య కార్యాకలాపాలు పూర్తిగా స్థంభించిపోయాయి. దుకాణాలు, కార్యాలయాలు మూతపడ్డాయి. ఏప్రిల్ నుంచి అమల్లోకి రానున్న ఆస్తి పన్నును వ్యతిరేకిస్తూ సిసిఐ జమ్ము విభాగం ఈ బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. సమ్మెకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కోర్టు కార్యకలాపాలు కూడా నిలిచిపోయాయి. అయితే సాధారణ ప్రజల రాకపోకలకు మాత్రం ఆటంకం కలిగించకుండా ఈ బంద్ చేపట్టడం విశేషం. సమ్మెలో పాల్గొనకుండా దుకాణాల యజమానులను జమ్ము పాలన యంత్రాంగం, పోలీసులు బెదిరింపులకు గురి చేసిందనీ, అయినా ధైర్యంగా మూసివేసి ఆస్తి పన్నుకు స్థానిక ప్రజానీకం తీవ్ర వ్యతిరేకత తెలియజేసిందని, బంద్‌ను విజయవంతం చేశారని సిఐఐ జమ్ము చాప్టర్ అధ్యక్షులు అరుణ్ గుప్తా అభినందించారు. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి), కాంగ్రెస్, నేషనల్ పాంథర్స్ పార్టీ, ఆమాద్మీ పార్టీ, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) సమ్మెకు మద్దతు ప్రకటించాయి.

కెపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్రువనారాయణ్ మృతి

బెంగళూరు : కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) వర్కింగ్ ప్రెసిడెంట్, చామరాజనగర్ మాజీ ఎంపి ధ్రువనారాయణ్ (62) శనివారం గుండెపోటుతో మరణించారు. గతంలో ఛామరాజనగర్ నుంచి ఆయన లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. కొంతకాలంగా హృదయ సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం మైసూరులోని ఆయన నివాసంలో కన్నుమూశారు. బెంగళూరు నుంచి శుక్రవారం మైసూరు వెళ్లిన ధ్రువనారాయణ షెడ్యూలు ప్రకారం శనివారం తిరిగి బెంగళూరు వెళ్లాల్సివుండేది. కానీ ఈ లోపే తమ నుంచి దూరమైమయ్యారని కెపిసిసి అధికార ప్రతినిధి ఎం లక్ష్మణ తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మైసూరులోని నంజన్‌గూడ్ నుంచి కాంగ్రెస్ తరుపున ఆయన పోటీ చేయాలని అనుకున్నారు. కాంగ్రెస్ నేత, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితర ప్రముఖులు మైసూరు వెళ్లి ధ్రువనారాయణ్‌కు నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ అధినేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి ఎస్ఆర్ బొమ్మై ప్రభృతులు సంతాపం తెలియజేశారు.

మహారాష్ట్రలో ప్రతిరోజు 8 మంది రైతులు మృతి

- ఎన్‌సిపి నేత అజిత్ పవార్

ముంబై : మహారాష్ట్రలో ప్రతిరోజూ ఎనిమిది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుని మృతి చెందుతున్నారని ఎన్‌సిపి నేత అజిత్ పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. గత బిజెపి ప్రభుత్వం కన్నా ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వంలోనే రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, తక్షణమే షిండే ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం (మార్చి 10వ తేదీన) జరిగిన శాసనసభా సమావేశాల్లో రైతు ఆత్మహత్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా షిండే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి 1,203 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆయన ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 'మహారాష్ట్రలో అకాల వర్షాల కారణంగా పంట నష్టపోతుంది. పండిన పంటకు మంచి ధర లభించడం లేదు. దాంతో రైతులు ఆవేదనతో పండించిన పంటను రోడ్లపై పడేస్తున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తెగిపోతున్నాయి. ఎరువుల ధరలు పెరిగిపోతున్నాయి. షిండే- ఫడ్నవీస్‌ల ప్రభుత్వం రైతులకు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చడం లేదు' అని పవార్ శాసనసభ సమావేశాల్లో మాట్లాడారు. అలాగే ఈ సమావేశాల్లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదికను ఉటంకిస్తూ.. గత రెండు నెల్లలో మరాట్వాడా ప్రాంతంలో 62 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఇక బీడ్ జిల్లాలో 22 మంది రైతులు చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఇరాన్ - సౌదీ మధ్య చారిత్రాత్మక ఒప్పందం

- దౌత్య సంబంధాల పునరుద్ధరణకు ఇరు దేశాలు అంగీకారం
- ఫలించిన చైనా మధ్యవర్తిత్వం - స్వాగతించిన పలు దేశాలు

బీజింగ్: ఏడేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెర దించుతూ ఇరాన్- సౌదీ అరేబియా దేశాలు చైనా మధ్యవర్తిత్వంలో దౌత్య సంబంధాల పునరుద్ధరణకు అంగీకరించాయి. అయిదు రోజుల పాటు బీజింగ్‌లో జరిగిన చర్చల అనంతరం ఈ మేరకు ఒక ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. . ఇరాన్, సౌదీ అరేబియా, చైనా విదేశాంగ మంత్రులు కలసి శనివారం ఈ మేరకు ఒక సంయుక్త ప్రకటన విడుదలజేశాయి. వచ్చే రెండు మాసాల్లో ఇరు దేశాలు పరస్పరం తమ దౌత్య, రాయబార కార్యాలయాలను తిరిగి తెరవాలని నిర్ణయించుకున్నాయి. ఈ ఒప్పందం ఇరాన్, సౌదీ అరేబియా సంబంధాల్లో ఒక పెద్ద మైలు రాయివంటిదని చైనా అభివర్ణించింది. ఖతార్, యుఎఇ, ఇరాక్, ఒమన్, లెబనాన్, బహ్రెయిన్, టర్కీ తదితర దేశాలు ఈ ఒప్పందాన్ని స్వాగతించాయి. మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలను తొలగించి, శాంతి సామరస్యాలను తిరిగి నెలకొల్పేందుకు ఇది ఎంతగానో తోడ్పడుతుందని అవి పేర్కొన్నాయి. ఈ సమస్యను అమెరికా చూసిన దానికి భిన్నంగా చైనా చూసింది. రెండు దేశాలను కలిపేందుకు జిన్‌పింగ్ చూపిన చొరవను ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోని గుటెరస్ ప్రశంసించారు. మధ్య ప్రాచ్యంపై తన ఆధిపత్యం చెలాయించేందుకు అమెరికా గల్ఫ్ దేశాల మధ్య విభేదాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తుంటే, చర్చలు, మైత్రి ద్వారా ఉద్రిక్తతల స్థానే ఈ ప్రాంతంలో శాంతి సామరస్యాలను నెలకొల్పడం కోసం చైనా కృషి చేస్తున్నది. ఇరాన్, సౌదీ అరేబియాలను కలపడం కోసం చైనా గుట్టు చప్పుడు కాకుండా చర్చలు నిర్వహించింది. మధ్య ప్రాచ్యంలో ఇటువంటి సమస్యను ఎదుర్కొంటున్న మిగతా దేశాలకు ఇదొక ఉదాహరణగా నిలిచింది. 2016లో షియా మత పెద్దను సౌదీ అరేబియా ఉరి తీయడంతో ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తాయి. దౌత్య సంబంధాలు తెగిపోయాయి. దీనిని అవకాశంగా తీసుకున్న అమెరికా . సౌదీ అరేబియాను ఇరాన్‌పైకి ఎగదోయడమే పనిగా పెట్టుకుంది.గల్ఫ్ దేశాల్లో అమెరికా ఆడుతున్న ఆటకు చెక్ పెట్టాలని నిర్ణయించుకున్న చైనా గత డిసెంబరులో గల్ఫ్ సమ్మిట్‌ను నిర్వహించింది. ఆ తరువాత చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ మధ్య ప్రాచ్య ప్రాంతంలో పర్యటించడం ఇవన్నీ ఈ రెండు దేశాల మధ్య చర్చలకు అనువైన భూమికను ఏర్పాటు చేశాయి. ఇక ముందు కూడా గల్ఫ్ దేశాల మధ్య సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకునేలా చూసేందుకు చైనా తమ వంతు తోడ్పాటునిస్తుందని విదేశాంగ మంత్రి వాంగ్ యీ పేర్కొన్నారు. నిన్నటివరకు అమెరికాకు మిత్ర దేశంగా ఉన్న సౌదీ లరేబియా ఇరాన్‌తో తన చర్చల విషయాన్ని అగ్రరాజ్యానికి తెలియజేయకుండా ఉంచడం విశేషం. అమెరికా పట్ల సౌదీ అరేబియా వైఖరిలో వచ్చిన మార్పునకు ఇదొక సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు.. ఇరాన్-సౌదీ ఒప్పందంపై అమెరికా వైట్ హౌస్ ప్రతినిధి జాన్ కర్బీ స్పందిస్తూ, తాము దీంట్లో ఎక్కడా నేరుగా పాల్గొనలేదని అన్నారు. ఇరు దేశాల మధ్య సయోధ్యను కుదర్చడంలో చైనా పాత్రను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) కొనియాడింది. ఇది ప్రాంతీయ భద్రతకే కాదు ప్రపంచ భద్రతకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని ఒమన్ విదేశాంగ శాఖ మంత్రి బదల్ అబూ పేర్కొన్నారు. కొత్త అధ్యాయానికి ఇది శ్రీకారం చుట్టిందని ఇరాక్ పేర్కొంది.



చైనా కొత్త ప్రధానిగా లీ కియాంగ్

- ముగిసిన పద్నాల్గవ ఎన్‌పిసి తొలివిడత సమావేశం

బీజింగ్: చైనా కొత్త ప్రధానిగా 63 ఏళ్ల లీ ఖియాంగ్ నియమితులయ్యారు. అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ ఆయన పేరును ప్రతిపాదించగా, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. లీ కెఖియాంగ్ స్థానంలో లీ కియాంగ్ కొత్త ప్రధానిగా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అయిదేళ్లపాటు ఈ బాధ్యతల్లో ఉంటారు. అక్టోబరులో జరిగిన సిపిసి మహాసభలో లీ కియాంగ్ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఎన్నికైన సంగతి తెలిసిందే. చైనాలో అతి పెద్ద నగరమైన షాంఘై ప్రాంత కమ్యూనిస్టు పార్టీ చీఫ్‌గా, 2004-07 మధ్య చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా లీ కియాంగ్ వ్యవహరించారు. కొత్త నాయకత్వ ఎన్నికతో పద్నాల్గవ చైనా పీపుల్స్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ నేషనల్ కమిటీ (సిపిపి సిసి) వార్షిక తొలి విడత సమావేశాలు శనివారంతో ముగిశాయి. ఈ ముగింపు సమావేశానికి చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్, ఇతర నాయకులు హాజరయ్యారు. నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ కొత్త చైర్‌పర్సన్ వాంగ్ హునింగ్ ముగింపు సమావేశంలో మాట్లాడారు. అంతకుముందు పదమూడో సిపిపిసిసి కార్యకలాపాల నివేదికను, అలాగే పద్నాల్గవ సిపిపిసిసి నేషనల్ కమిటీ ప్రవేశపెట్టిన రాజకీయ తీర్మానాన్ని నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ఆమోదించింది. ఈ సమావేశాలకు మొత్తం 2,950 మంది డిప్యూటీలు హాజరయ్యారు.

బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్‌పీపుల్స్‌లో జరిగిన పద్నాల్గవ సిపిపిసిసి నేషనల్ కమిటీ తొలివిడత సమావేశ దృశ్యం

లాలూ నివాసంలో కోటి నగదు స్వాధీనం !

- మరో రూ.600కోట్ల విలువైన వస్తువులు లభ్యం
- ఇడి వెల్లడి

న్యూఢిల్లీ : ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ కుటుంబ నివాసంపై దాడి సందర్భంగా సరైన లెక్కలు లేని రూ.కోటి రూపాయిల వరకు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శనివారం తెలిపింది. మరో రూ.600కోట్ల మేర విలువైన వస్తువులను గుర్తించినట్లు వెల్లడించింది. మనీ లాండరింగ్ కేసుతో ముడిపడిన ఉద్యోగాల కుంభకోణం కేసులో శుక్రవారం ఇడి లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యుల నివాసాలపై దాడులు జరిపింది. యాదవ్ కుటుంబానికి బహుమతిగా ఇచ్చిన లేదా చవక ధరలకు భూములను విక్రయించిన వారికి ప్రతిగా రైల్వేలో ఉద్యోగాలు ఇప్పించారని లాలూ కుటుంబంపై ఆరోపణలు వచ్చాయి. లాలూ కుమారుడు, బీహార్ డిప్యూటీ ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌ను కూడా ప్రశ్నించే నిమిత్తం సిబిఐ శనివారం పిలిచింది. గర్భవతి అయిన తన భార్య బాగోగులు చూసుకోవాలని, అందువల్ల ఇడి పేర్కొన్న తేదీల్లో విచారణకు హాజరుకాలేనని తేజస్వి తెలిపారు. మరో రోజున హాజరవుతానని తెలియచేసినట్లు అధికారులు తెలిపారు.

మళ్లీ 16న విచారణ

(మొదటిపేజీ తరువాయి)

తుగ్లక్ రోడ్డులోని కెసిఆర్ నివాసానికి బయలుదేరారు. అక్కడ నుంచి కవిత హైదరాబాద్‌కు బయలుదేరారు.

సౌత్ గ్రూప్‌లో మీ పాత్ర ఏంటీ....?

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఢిల్లీ మద్యం పాలసీ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన సౌత్ గ్రూప్‌తో కవితకు ఉన్న సంబంధాలపైనే ప్రధానంగా ఇడి అధికారులు విచారణ చేపట్టారు. అరుణ్ పిళ్లై, బుచ్చిబాబు, అభిషేక్, శరత్ చంద్రారెడ్డి, మాగుంట రాఘవ, సమీర్ మహేంద్రు, అమిత్ అరోరా ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రశ్నల వర్షం కురిపించారు. సంభాషణలు, వాట్సాప్ చాట్ లు, డిజిటల్ ఆధారాలను కవిత ముందుంచి ప్రశ్నించారు. 'లిక్కర్ పాలసీ రూపొందిస్తోన్న విషయం ఎలా తెలుసు?, అందులో చేరాలని ఎవరు కోరారు? ఇందుకోసం ఎవరు సంప్రదించారు.?' తదితర ప్రశ్నలతో విచారణ సాగించారు. ఢిల్లీ, హైదరాబాద్ వేదికగా జరిగిన సమావేశాలను ప్రస్తావించింది. రూ.100 కోట్ల ముడుపుల వ్యవహారం, హవాల మార్గంలో వాటిని తరలించి తీరుపై ప్రశ్నించింది. అలాగే ఒకటి రెండు రోజుల తేడాలో తనకు చెందిన రెండు ఫోన్ల నెంబర్ల కలిగిన మొత్తం 10 విలువైన ఫోన్ల ధ్వంసానికి కారణాలను అడిగినట్లు సమాచారం.

పిళ్లైతో కలిపి విచారణ..?

శనివారం ఉదయం రెండు గంటల పాటు కవితను ఒంటిరిగా ఈడి ప్రశ్నించింది. అయితే, మధ్యాహ్న తరువాత తమ కస్టడీలో ఉన్న మద్యం వ్యాపారి అరుణ్ పిళ్లైతో కలిసి విచారించినట్లు సమాచారం. కవిత ఇచ్చిన స్టేట్‌మెంట్‌లోని ప్రశ్నలను, పిళ్లై సమక్షంలో క్రాస్ ఎగ్జామిన్ చేసినట్లు తెలిసింది. తాను కవిత బినామినంటూ పిళ్లై ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ప్రస్తావించింది. 'ఢిల్లీ మద్యం కుంభకోణం గురించి నాకేం తెలీదు. నేను కుట్ర దారురాలిని కాదు. నేనేం ఆధారాలు ధ్వంసం చేయలేదు' అని కవిత చెప్పినట్లు సమాచారం.

ఇడి కార్యాలయం వద్ద భారీ భద్రత

ఇడి విచారణకు కవిత హాజరైన నేపథ్యంలో బిఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతల హడావుడి పెరిగింది. ఇడి కార్యాలయం వెళ్లే మార్గాల్లో మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. బిఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతలు ఇడి కార్యాలయం వద్దకు చేరుకోకుండా ఢిల్లీ పోలీసులు భద్రతను భారీగా పెంచారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేశారు. మరోవైపు సాయంత్రం 5.30 గంటలకే విచారణ ముగియాల్సి ఉండగా.. అనూహ్యంగా ఆ సమయాన్ని పెంచారు. రూల్ ప్రకారం మహిళలను సాయంత్రం 6 వరకు మాత్రమే విచారించాల్సివున్నా, సమయం దాటినా కవితను ఇడి బయటకు పంపలేదు. దీనిపై బిఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశాయి.

మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో నినాదాలు చేస్తున్న బిఆర్ఎస్ కార్యకర్తలు

ఢిల్లీలో ఏడుగురు మంత్రుల మకాం

కవిత ఇడి విచారణ నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన ఏడుగురు మంత్రులు కెటిఆర్, హరీష్ రావు, మహమ్మద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డిలు ఢిల్లీలోనే మకాం వేశారు. శుక్రవారం రాత్రికే మంత్రి కెటిఆర్, హరీష్ రావు ఢిల్లీ చేరుకున్నారు. అనంతరం సిఎం కెసిఆర్ నివాసంలో కెటిఆర్, హరీష్ రావు, కవిత, లీగల్ టీం భేటి అయ్యారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దగ్ధం

ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యలకు నిరసనగా బిఆర్‌ఎస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ ముందు బండి సంజయ్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. బిజెపికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రేఖా శర్మకు తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో మీడియాతో మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కవితపై సంజయ్ అనుచిత వ్యాఖ్యలపై గవర్నర్ తమిళిసై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి మాటలకు తావు లేదన్నారు. ఇడి, సిబిఐ దాడులకు తెలంగాణ బిడ్డలు భయపడరని సత్యవతి రాథోడ్ స్పష్టం చేశారు

మీకోసం

చేపముక్కలకు కొంచెం ఉప్పు కలిపి డీప్ ఫ్రీజర్‌లో ఉంచితే నిల్వ ఉంటాయి. ముక్కలు అంటుకోవు.

జీవన సౌరభం

వైఫల్యం ఎదురైతే నిరాశ చెందకూడదు.. అది కొత్త ప్రేరణకు పునాది కావాలి.

అమాయక రాజు

రామకోటి రాజ్యాన్ని భూపతి రాజు పరిపాలిస్తున్నాడు. అతడు చాలా అమాయకుడు. అందరూ మంచివారని నమ్మేవాడు. మంత్రులు, సైనికులు, ప్రజలు ఏవో అబద్ధాలు చెప్పి రాజు దగ్గర హారాలు, బహుమతులు తీసుకునేవారు.

ఒక రోజు బట్టలు కుట్టే వ్యక్తి రాజు వద్దకు వచ్చి 'రాజా, నేను బంగారు బట్టలు నేస్తాను. కొంత బంగారం ఇప్పించండి' అన్నాడు.

రాజు బంగారం కొన్ని బంగారు బిస్కెట్లు ఇచ్చాడు 'మంచి బంగారం ఇచ్చాను. కొద్ది రోజుల్లో పండగ ఉంది. ఆ రోజుకు బట్టలు నేయించి ఇవ్వాలి' అని ఆజ్ఞాపించారు.

'అలాగే' అని ఆ వ్యక్తి బంగారం తీసుకుని వెళ్లిపోయాడు.కొన్ని రోజులు గడిచాయి. పండగ రోజు దగ్గరకు వచ్చింది. ఇంకా బట్టలు రాలేదు. భటులను పంపించి అతడిని తీసుకురమ్మని ఆదేశించాడు రాజు.

భటులు రాజ్యమంతా వెతికారు. ఆ వ్యక్తి జాడ ఎక్కడా కనిపించలేదు. తాను మోసపోయానని తెలుసుకున్నాడు రాజు. అతని గురించి తెలుసుకోకుండా, విచారించకుండా అంత బంగారం ఇవ్వడం తాను చేసిన తప్పు అని గ్రహించాడు. అప్పటి నుంచీ ఎవరిని గుడ్డిగా నమ్మకూడదని నిర్ణయించుకున్నాడు.

- కారంకంటి రోహిత్
7వ తరగతి,
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.

లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 68



నేను గీసిన బొమ్మ



సిహెచ్.నవదీప్,
1వ తరగతి,
గాదెవారిగూడెం,
గంపలగూడెం మండలం,
ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

అర్థం చేసుకుంటే అంతా మంచే!

బంధం ఏదైనా పరస్పర అవగాహన చాలా ముఖ్యం. పరస్పర గౌరవం ఇంకా ముఖ్యం. భార్యాభర్తల మధ్య అయితే, అవి రెండూ మరీ మరీ ముఖ్యం. ఒకరిపై ఒకరు అధికారంతో కాక అవగాహనతో, ఇష్టంతో వ్యవహరించాలి. ఒకరి అభిప్రాయాలను ఒకరు పరిగణనలోకి తీసకోవాలి. అప్పడే బంధం బలోపేతం అవుతుంది.

కొత్తగా పెళ్లైన భార్యాభర్తలు, అప్పుడే ప్రేమలో పడ్డ ప్రేమికుల మధ్య చిన్న చిన్న అలకలు, గొడవలు సహజం. అవి ఒకరిమరొకరు అర్థం చేసుకునే క్రమంలో వచ్చే తగువులుగానే చూడాలి. కాని అవి శృతి మించకుండా చూసుకోవాలి. అలా జరగకుండా ఉండాలంటే వారిని నిత్యం అర్థం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తుండాలి. అప్పుడే ఆ బంధం మరింత బలపడుతుంది. ఇటీవల వివాహం చేసుకున్న జంటలు కొద్ది నెలల్లోనే విడుపోతున్నారని నిపుణులు చెబుతున్నారు. అందుకు కారణం వారి మధ్య అవగాహనా లోపమే. 'నేను చెప్పిందే జరగాలి, నేను చెప్పినట్లే ఉండాలి, నా మాటే వినాలి'...అన్న ధోరణి ఏ బంధంలోనూ ఉండకూడదు. అలా ఉంటే అవతలి వ్యక్తి మీద ప్రేమ పోయి అసహనం ఆవహిస్తుంది.

భార్యాభర్తలు ఒకరి అభిప్రాయాలను, నిర్ణయాలను మరొకరు ప్రాధాన్యతనిచ్చుకోవాలి. ఒకరు కోపంలో మాట్లాడినా మరొకరు అది అవమానంగా భావించకూడదు. ఆ సమయంలో వాదనకు దిగకుండా ఉండటమే మంచిది. ఓర్పుగా ఉండాలి. నిదానంగా వారితో ఆ విషయంపై చర్చిస్తే సరిపోతుంది. అప్పుడు ఇద్దరి మధ్యా ప్రేమ పెరుగుతుంది. బయట వ్యక్తులు ముందు, కుటుంబ సభ్యుల ఎదుట భాగస్వామిని చులకనగా మాట్లాడడం సరైన పద్ధతి కాదు. అది భవిష్యత్తులో ఇద్దరికీ సమస్యలు తెచ్చిపెడుతుంది.

చాలా జంటలు పెళ్లికి ముందు ఉన్నంత ప్రేమగా, పెళ్లి తర్వాత ఉండటం లేదని నిపుణులు చెబుతున్నారు. అంటే పరిచయం అయిన కొత్తలో ప్రేమికులుగా, స్నేహితులుగా ఒకరి భావాలను మరొకరు అర్థం చేసుకునేందుకు ప్రాధాన్యత ఇస్తారు. సమయాన్ని కేటాయిస్తారు. పెళ్లి తర్వాత సమయం కేటాయించడానికి ఇష్టపడరు. పని ఒత్తిడి అంటూ కారణాలు చెబుతూ భాగస్వామికి సమయం ఇచ్చేందుకు ఆసక్తి చూపరు. ఇదే పెద్ద పొరపాటు. తాను ఎందుకు సమయం కేటాయించలేకపోతున్నానో కూడా చెప్పాలి. ఉన్న కొద్దిపాటి సమయంలోనే తనతో గడపాలి. అప్పుడు వారి మధ్య దూరం పెరగదు. ముందు భార్యాభర్తల మధ్య అహం రాకూడదు. అలా ఉండాలంటే ముందు స్నేహితులుగా ఉండాలి. మీ భాగస్వామిని స్నేహితురాలిగా/ స్నేహితుడిగా మార్చుకున్నప్పుడు మానసికంగా చాలా దగ్గరవుతారు. సమస్యలు తలెత్తవు. ఆ బంధాన్ని కూడా త్వరగా వదులుకునేందుకు సిద్ధపడరు.

బంధం అనేది ఒకరినొకరు సంతోషపెట్టి ముందుకు సాగడమే. మీ భాగస్వామి మెచ్చుకునే అలవాట్లను స్వీకరించండి. వారు అభినందిస్తున్న విషయాలపై ఎక్కువ దృష్టి పెట్టండి. దీంతో మీపై వారికి ప్రేమ, అభిమానం పెరుగుతుంది. అప్పుడు పెళ్లయిన 40 ఏళ్ల తర్వాత కూడా మీ మధ్య ప్రేమ తగ్గదు. తొలిరోజుల్లో ప్రేమించుకున్నట్లుగా ఉన్న ప్రేమ ఆ తర్వాత కూడా ఉండాలంటే ప్రతిరోజూ ప్రేమించండి. అప్పుడు దాంపత్య జీవితం పట్ల విసుగు ఉండదు.

పొగ తాగడం ఇలా మానేయొచ్చు!

చాలా మంది పొగ తాగే అలవాటును మానాలనుకున్నా మానలేరు. అటువంటి వారు చిన్న చిన్న చిట్కాలు పాటించి ఆ దురలవాటును పూర్తిగా దూరం చేసుకోవచ్చు.

- ధూమపాన అలవాటును మానుకోవడానికి 'తేనె'ను ఉపయోగించవచ్చు. ఇందులో ప్రోటీన్లు, ఎంజైములు, ఇతర విటమిన్లు ఉంటాయి. ప్రతిరోజూ ఉదయం ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో 'నిమ్మరసం', ఒక చెంచా తేనె కలిపి తాగుతుంటే పొగ తాగడంపై శ్రద్ధ తగ్గుతుంది.
- 'రాగి పాత్ర'లో ఉంచిన నీటిని తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ తొలగిపోతాయి. దీన్ని తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఈ నీటిని తాగడం వల్ల ధూమపాన వ్యసనాన్ని కూడా తగ్గించుకోవచ్చు.
- ధూమపానానికి దూరంగా ఉండాలంటే 'దాల్చిన చెక్క' ముక్కను నోటిలో కొంత సమయం పాటు ఉంచుకోవచ్చు.
- ధూమపానం మానేయడానికి 'త్రిఫల పొడి'ని ప్రతిరోజూ పడుకునే ముందు తీసుకోవాలి.
- ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో తులసి ఆకులను నమిలితే పొగతాగే అలవాటును దూరం చేసుకోవచ్చు.
- ధూమపానం తగ్గించుకోవడానికి క్రమం తప్పకుండా 'వ్యాయామం' చేయాలి. ఇలా చేయడం వల్ల ఊపిరితిత్తులలో నికోటిన్ ఉత్పత్తి తగ్గడం ప్రారంభమవుతుంది.

ఈ సాధారణ చిట్కాలను క్రమం తప్పకుండా పాటించి ఈ చెడు అలవాటు నుంచి త్వరగా బయటపడవచ్చు.

కొబ్బరినీళ్లు ఆరోగ్యకరం

కొబ్బరినీళ్ళలో కాల్షియం, ఫాస్ఫరస్, సోడియం, పొటాషియం, మెగ్నీషియం లాంటి ఖనిజ లవణాలు ఉంటాయి. ప్రతిరోజూ గ్లాసు కొబ్బరినీళ్లు తాగితే ఎండలో శరీరం డీ హైడ్రేషన్ కాకుండా కాపాడుకోవచ్చు. కూల్‌డ్రింక్స్ కన్నా కొబ్బరినీళ్లు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది.

- కొబ్బరి నీళ్లల్లో ఉన్న లవణాలు దాహాన్ని తీరుస్తాయి. రక్తపోటుని అదుపులో ఉంచుతాయి. కోల్పోయిన శక్తిని తిరిగి పొందవచ్చు.
- తక్కువ కొవ్వులు ఉండే కొబ్బరినీళ్లు రోజూ తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. శరీరానికి కావలసిన పోషకాలూ అందుతాయి.
- గర్భిణులకు కొబ్బరి నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. ఇందులో ఉండే విటమిన్ బి9 కడుపులో బిడ్డ ఎదుగుదలకు దోహదపడుతుంది. ఈ సమయంలో వచ్చే జీర్ణ సమస్యలు తగ్గిపోతాయి. కొబ్బరి నీళ్లు లారిక్ యాసిడ్‌ని ఉత్పత్తి చేయడం వల్ల తల్లిపాలు సమృద్ధిగా పడతాయి.
- కొబ్బరినీళ్లుఆరోగ్యాన్నే కాదు అందాన్ని పెంచుతాయి. కొబ్బరి నీళ్ళను ముఖానికి రాసుకోవడం వల్ల మొటిమల వల్ల వచ్చే మచ్చలు క్రమేనా తగ్గిపోతాయి. చర్మం కూడా తాజాగా, అందంగా మారుతుంది.

గ్యారంటీలపై ఉక్కుపాదం

- 2022 పాలసీ తెస్తున్న కేంద్రం
- ఒకే తరహాపై కొన్ని రాష్ట్రాల విముఖత

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పలు ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకునే రుణాలపై రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్యారంటీలపై కేంద్రం ఉక్కుపాదం మోపనుంది. గ్యారంటీల పాలసీ-2022ను అమలు చేయడం ద్వారా గ్యారంటీలను కట్టడి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలతో పాలసీపై చర్చలు కూడా నిర్వహిస్తోంది. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలతో ఇప్పటికే రెండు విడతలుగా చర్చలు నిర్వహించిన కేంద్రం, రిజర్వ్‌బ్యాంకులు పలు నిర్ణయాలను తీసుకున్నట్లు తెలుస్తోంది. దేశ వ్యాప్తంగా ఏక రూప గ్యారంటీ విధానాన్ని అమలు చేసే అంశంపై కొన్ని రాష్ట్రాలు విముఖత వ్యక్తం చేస్తుండగా, మిగిలిన అంశాలపై మాత్రం సానుకూలంగానే స్పందించినట్లు సమాచారం. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్యారంటీలు ఇవ్వరాదన్న విధానాన్ని అమలు చేయనున్నారు. గ్యారంటీ అన్నది ఒక విధానంలా కాకుండా రుణం తీసుకున్న సంస్థ తరఫున భవిష్యత్తులో తిరిగి చెల్లించేలా ఉండాలని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రాలు తీసుకునే గ్యారంటీలపై ప్రస్తుతం ఎటువంటి నిషేధం, పరిమితి లేకపోయినప్పటికీ, త్వరలోనే కొంత పరిమితి విధించాలన్న కోణంలో కసరత్తు చేస్తున్నారు. జిఎస్‌డిపి లేదా సొంత ఆదాయాల్లో నిర్దిష్ట శాతం మేరకే గ్యారంటీలు ఇవ్వాలన్న విధానాన్ని అన్ని రాష్ట్రాల్లో అమలులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. దీనికి దాదాపుగా అన్ని రాష్ట్రాలు అంగీకరించడం విశేషం. అలాగే మార్కెట్ రుణాల ద్వారా, గ్యారంటీల ద్వారా తీసుకునే రుణాలు మొత్తం జిఎస్‌డిపి పరిధిలోనే ఉండేలా చూడాలన్న విధానానికి కూడా కొన్ని రాష్ట్రాలు అంగీకరించినట్లు తెలిసింది. అయితే ఒక్క ఒడిశా మాత్రం తమకు ఏకరూప విధానం సరిపడదని తిరస్కరించడం విశేషం.

సంస్థలకు ఇచ్చే గ్యారంటీల కారణంగా తలెత్తే ప్రమాద సూచికలపైనా కీలక చర్చ జరుగుతుండడం గమనార్హం. 100 శాతం రిస్క్ లేని విధంగానే గ్యారంటీలు ఉండాలని రిజర్వ్‌బ్యాంకు స్పష్టం చేస్తోంది. ప్రభుత్వాలు ఇచ్చే గారంటీల వివరాలను ఇండియన్ గవర్నమెంట్ అకౌంటింగ్ స్టాండర్స్ మేరకు తప్పనిసరిగా బహిరంగంగా ప్రకటించాలని కూడా రిజర్వ్‌బ్యాంకు తేల్చిచెబుతోంది. కేంద్రం తయారుచేస్తున్న 2022 పాలసీ తరహాలోనే రాష్ట్రాల్లో కూడా గ్యారంటీ పాలసీలు తయారుచేసుకోవాలని రిజర్వ్‌బ్యాంకు స్పష్టం చేస్తోంది. ఈ విధానాలన్నీ పాటిస్తే రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీల ద్వారా సేకరించే రుణాలు కష్టంగా మారుతాయని అధికారులు అంటున్నారు.

దీటుగా జవాబిస్తున్న టీమిండియా

- గిల్ సెంచరీ..
- కోహ్లీ అర్ధ సెంచరీలు

అహ్మదాబాద్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరుగుతున్న నాల్గో టెస్ట్‌లో టీమిండియా ధీటుగా బ్యాటింగ్ చేస్తోంది. ఓవర్ నైట్ స్కోరు 36పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన టీమిండియా మూడోరోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 289పరుగులు చేసింది. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్(128) సెంచరీకితో తోడు, సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లి(59నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. శనివారం మూడో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ (35)ను కున్హెమన్ బౌలింగ్‌లో షాట్ ఆడేందుకు యత్నించి షార్ట్ కవర్ పాయింట్‌లోని లబూషేన్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన పుజారాతో కలిసి గిల్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ క్రమంలో లంచ్ బ్రేక్ సమయానికి భారత్ వికెట్ నష్టానికి 129 పరుగులు చేసింది. రెండో సెషన్ ప్రారంభంలో ఆసీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో భారత్ బ్యాటర్లు నిదానంగా ఆడారు. తర్వాత కాస్త దూకుడు పెంచారు. టీ విరామానికి ముందు గిల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కొద్ది సేపటికే పుజారా ఔటయ్యాడు. అతడు మర్ఫీ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. రెండో సెషన్‌లో భారత్ 59 పరుగులు మాత్రమే రాబట్టి రెండు వికెట్లను కోల్పోయింది.

మూడో సెషన్‌లో కోహ్లీ దూకుడు

టీ విరామ సమయానికి 2 వికెట్ల నష్టానికి 188 పరుగులతో చివరి సెషన్‌ను ఆరంభించిన భారత్‌ను కోహ్లీ ఆదుకున్నాడు. స్టార్క్, మర్ఫీ వేసిన వరుస ఓవర్లలో బౌండరీలు బాదాడు. కొద్దిసేపటికే అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన గిల్.. లియన్ బౌలింగ్‌లో ఎల్బీగా ఔటయ్యాడు. డీఆర్ఎస్‌కు వెళ్లినా.. సమీక్షలోనూ ఔట్‌గా తేలడంతో పెవిలియన్ బాట పట్టాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన జడేజా నిదానంగా ఆడగా.. కోహ్లీ నిలకడగా పరుగులు రాబట్టి అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. కోహ్లీకిది టెస్టుల్లో గత 16ఇన్నింగ్స్‌ల్లో తొలి అర్ధ సెంచరీ మాత్రమే.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్-480ఆలౌట్

ఇండియా తొలి ఇన్నింగ్స్: రోహిత్ (సి)లబూషేన్ (బి)కున్హెమన్ 35, శుభ్‌మన్ (ఎల్‌బి)లియాన్ 128, పుజారా (ఎల్‌బి)మర్ఫీ 42, కోహ్లీ (బ్యాటింగ్) 59, జడేజా (బ్యాటింగ్) 16, అదనం 5. (99ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 289పరుగులు. **వికెట్ల పతనం:** 1/74, 2/187, 3/245 **బౌలింగ్:** స్టార్క్ 17-2-74-0, గ్రీన్ 10-0-45-0, లియాన్ 37-4-75-1, కున్హెమన్ 13-0-43-1, మర్ఫీ 22-6-45-1.

ఆస్కార్ సర్వం సిద్ధం..

ఆస్కార్ వేడుకకు సర్వం సిద్ధమైంది. ఈ రోజు లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్ వేదికగా జరగనున్న ఈ వేడుకలో ఈసారి తెలుగు చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్ సందడి చేయనుంది. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో 'ఆర్‌ఆర్‌ఆర్'లోని నాటునాటు పాట నామినేషన్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. సినిమా టీమ్‌లో కీలకమైన వారంతా కొన్ని రోజుల నుండి అమెరికాలో సందడి చేస్తున్నారు. ఆస్కార్ వేదికపై కీరవాణి సంగీత సారథ్యంలో ఆ పాటను సింగర్స్ కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ లైవ్ ప్రదర్శన చేయనున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాలో ఉన్న 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌కు నటి ప్రియాంక చోప్రా ప్రత్యేకంగా పార్టీ ఇచ్చారు. సౌత్ ఏషియన్ ఎక్స్‌లెన్స్ పేరుతో జరిగిన ఈ వేడుకల్లో ఉపాసన కూడా పాల్గొన్నారు. తన భర్త రామ్‌చరణ్, ప్రియాంకలతో ఉన్న ఫొటోలు ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ.. 'లాస్ ఏంజెల్స్ ఫ్యామిలీ..ఎల్లప్పుడూ మాకోసం ఉన్నందుకు థ్యాంక్యూ ప్రియాంక' అని పేర్కొన్నారు.

జగన్ పాలనలో అందరూ బాధితులే

- అధికారంలోకి వస్తే పేదలపై పన్నుల భారం తగ్గిస్తాం
- యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ
- నేడు, రేపు యాత్రకు విరామం

ప్రజాశక్తి-కురబలకోట (అన్నమయ్య జిల్లా)

ముఖ్యమంత్రి జగన్ పాలనలో అందరూ బాధితులేనని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. పెట్రోల్, డీజిల్‌పై వేస్తున్న పన్నుల వల్లే నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర ధరలు తగ్గిస్తామని హామీ నిచ్చారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర శనివారం 41వ రోజుకు చేరుకుంది. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోటలోని నందిరెడ్డివారిపల్లె చేనేత నగర్ నుంచి యాత్ర ప్రారంభమైంది. యాత్ర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో కురుబ, కుమ్మరి సామాజిక తరగతులతో మాటామంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. వైసిపి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆరు లక్షల సామాజిక పింఛన్లు తొలగించారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన అందరికీ పింఛన్లు ఇచ్చి తీరుతామన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ క్లస్టర్స్ ఏర్పాటు చేసి చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను ప్రోత్సహిస్తామని తెలిపారు. శాలివాహన సామాజిక తరగతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. కుమ్మరుల ఉత్పత్తులను అధికారంలోకి రాగానే తాము ప్రమోట్ చేస్తామని తెలిపారు. కురుబ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కృషి చేస్తామని, కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక మూగజీవాలు మేపుకోవడానికి బీడు భూములు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని హామీనిచ్చారు.

కుండను తయారు చేస్తున్న లోకేష్

నియోజకవర్గం వీడాలంటూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు

ఎన్నికల నిబంధనల ప్రకారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని వీడాలంటూ లోకేష్‌కు ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసేందుకు ముందుగానే నిర్ణయించుకున్నందున తాను స్థానికంగా అన్నమయ్య జిల్లా కంటేవారిపల్లి విడిది కేంద్రంలో ఉండేందుకు మినహాయింపు ఇవ్వాలని ఎన్నికల సంఘాన్నికి లోకేష్ విజ్ఞప్తి చేశారు. లోకేష్ విజ్ఞప్తి మేరకు కేంద్ర ఎన్నికల సంఘం పైవిధంగా స్పందించింది. ఎన్నికల సంఘాన్ని, చట్టాలను గౌరవించి జిల్లాను వీడుతున్నట్లు లోకేష్ ప్రకటించారు. కంటేవారిపల్లి నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా యువగళం పాదయాత్రకు 12, 13వ తేదీల్లో విరామం ప్రకటించారు. తిరిగి కంటేవారిపల్లి నుంచి యాత్ర ప్రారంభం కానుంది.

న్యూజిలాండ్‌కు స్వల్ప ఆధిక్యత

శ్రీలంకతో తొలిటెస్ట్

క్రైస్ట్‌చర్చ్: శ్రీలంకతో జరుగుతున్న తొలిటెస్ట్ ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప ఆధిక్యత సంపాదించింది. ఓవర్‌నైట్ స్కోర్ 5 వికెట్ల నష్టానికి 162పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ జట్టు 373పరుగులకు ఆలౌటైంది. మిఛెల్(102), హెన్రీ(72) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో న్యూజిలాండ్‌కు 18పరుగుల స్వల్ప ఆధిక్యల లభించింది. ఫెర్నాండోకు నాలుగు, కుమారకు మూడు, రజితకు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 83పరుగులు చేసింది. మాథ్యూస్(20), జయసూరియ(2) క్రీజ్‌లో ఉన్నారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక జట్టు 355పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

కాప్ దెబ్బకు గుజరాత్ విల విల

- 10 వికెట్ల తేడాతో ఢిల్లీ ఘన విజయం

ముంబయి: మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో ఢిల్లీ జట్టు మరో విజయాన్ని సొంతం చేసుకుంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు 10 వికెట్ల తేడాతో గుజరాత్‌పై ఘన విజయం సాధించింది. తొలుత మరిజానే కాఫ్(5/15) అద్భుత బౌలింగ్‌తో చెలరేగడంతో గుజరాత్ జెయింట్స్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 105పరుగులే చేసింది. ఛేదనలో ఢిల్లీ జట్టు కేవలం 7.1 ఓవర్లలోనే 107పరుగులు చేసి గెలిచింది. షెఫాలీ వర్మ(76నాటౌట్; 28బంతుల్లో 10ఫోర్లు, 5సిక్సర్లు), కెప్టెన్ లానింగ్(15నాటౌట్; 15బంతుల్లో 3ఫోర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడారు. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను కాప్, రాధా యాదవ్(1/19) కట్టడి చేశారు. ఆ తర్వాత శిఖా పాండే(3/29) కూడా రాణించడంతో గుజరాత్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 105పరుగులే చేయగల్గింది. హర్లిన్ డియెల్(20), వారేహామ్(22) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మరిజన్నె కాఫ్‌కు లభించింది.

డబ్ల్యుపిఎల్‌లో నేడు..
యుపి వారియర్స్ × ముంబయి ఇండియన్స్
(వేదిక: బ్రాబౌర్న్ స్టేడియం, రాత్రి 7.30గం॥లకు)

దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్

రెండో టెస్ట్‌లో విండీస్‌పై 284పరుగుల తేడాతో గెలుపు

జొహన్నెస్‌బర్గ్: వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు 2-0తో చేజిక్కించుకొని క్లీన్‌స్వీప్ చేసింది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వెస్టిండీస్ జట్టు చివరిరోజు 106పరుగులకే కుప్పకూలింది. డి-శిల్వా(34), జోసెఫ్(18), హోల్డర్(19) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. హార్మర్, కోర్జేకు మూడేసి, రబడా, మహరాజ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బవుమాకు, సిరీస్ మార్క్రమ్‌కు లభించాయి. ఇరుజట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ 16నుంచి ప్రారంభం కానుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68